ప్రజాశక్తి

శనివారం 24 మే 2025 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

సాగునీటిపై కొరవడిన శ్రద్ధ



పల్నాడు జిల్లాలోని చిలకలూరిపేట మద్ద ఓగేరు వాగు దుస్థితి

- ఖరీఫ్ సన్నద్ధతపై పట్టించుకోని యంత్రాంగం
- కాల్వల మరమ్మతులకు మంజూరవ్వని నిధులు
- డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ప్రాజెక్టు కమిటీలతో జరగని భేటీలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఖరీఫ్ సీజన్ సన్నద్ధతపై అధికారులు, ప్రజా ప్రతినిధులు ఇంత వరకు దృష్టి సారించలేదు. నీటి సంఘాల ఎన్నికలు జరిగి అన్ని స్థాయిలోనూ రైతుల కమిటీలున్నా రాబోయే ఖరీఫ్‌లో రైతులకు ఇబ్బంది లేకుండా పైర్లకు నీరందించే అంశంలోనూ ఇంత వరకు అధికారులు ప్రజా ప్రతినిధులు, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ప్రాజెక్టు కమిటీలతో సమావేశాలు ఏర్పాటు చేయలేదు. జిల్లా నీటిపారుదల అభివృద్ధి మండలి సమావేశాలు దాదాపు కొన్నేళ్లుగా జరగడం లేదు. డిఆర్‌సి సమావేశాలు మినహా మిగతా సమయాల్లో వాతావరణ పరిస్థితులు, ఇతర అంశాలపై క్షేత్రస్థాయిలో సమీక్షలు లేవు. ప్రధానంగా రాబోయే ఖరీఫ్ సీజన్‌లో పైర్లకు సక్రమంగా నీరు అందించేలా వేసవిలో మరమ్మతులు ఇంకా ప్రారంభం కాలేదు.

మరో వారం రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది. గతేడాది కంటే ఈ ఏడాది వర్షాలు ముందస్తుగా వస్తాయన్న సమాచారం ఉంది. ఇప్పటికే మేనెలలోనే వర్షాలు మెరుగ్గా కురిశాయి. రైతులు ఇప్పటికే ముందస్తు ఖరీఫ్‌కు సన్నద్ధం అవుతుండగా వ్యవసాయ, నీటిపారుదల శాఖలు ఇంతవరకు తమ కార్యాచరణ ప్రణాళికలు విడుదల చేయలేదు. నీటి పారుదలకు సంబంధించి గతేడాది ఆగస్టు 31న కురిసిన అతిభారీ వర్షాలకు రెండు జిల్లాల పరిధిలో రెండు లక్షల ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. గుంటూరు జిల్లాలో కేవలం 42 వేల ఎకరాల్లో, పల్నాడు జిల్లాలో 16 వేల ఎకరాల్లోనే నష్టం జరిగినట్టు గుర్తించి రైతులకు పరిహారం ఇచ్చారు. కానీ దాదాపు వారం రోజులపాటు పైర్లన్నీ నీళ్లలోనే నానిపోయాయి. గత ప్రభుత్వ హయాంలో నీటి పారుదల రంగాన్ని ప్రధానంగా కాల్వల నిర్వహణను గాలికి వదిలేయడం వల్ల ముంపు సమస్య వచ్చిందని చెబుతూ వచ్చిన టిడిపి కూటమి గతేడాది కాలంలో ఇంత వరకు చెప్పుకోదగ్గ రీతిలో కాల్వల మరమ్మతులు చేయలేదు.

నల్లమడ వాగు ముంపు సమస్య ఉమ్మడి జిల్లాలోని బాపట్ల, రేపల్లె, ప్రత్తిపాడు, పొన్నూరు నియోజకవర్గాల పరిధిలో పలు గ్రామాల్లో పైర్లను కభళిస్తుంది. గుంటూరు ఛానల్ అధునీకరణ, విస్తరణ పనులు ఇంత వరకు ప్రారంభం కాలేదు. భూ సేకరణకు రూ.100 కోట్లు నిధులు కేటాయించినా ఈ ప్రక్రియ కూడా ఊపందుకోలేదు. కొండవీటి వాగు వల్ల గతేడాది వేలాది ఎకరాలు పైర్లునీట మునిగాయి. కృష్ణా పశ్చిమ డెల్టా, నాగార్జున సాగర్ ఆయకట్టు

▶ 2లో



ఘటనా స్థలిలో ఆందోళన చేస్తున్న తుళ్లూరు ఎస్సీ కాలనీ వాసులు

సాయంగా వెళ్లి.. కడుపుకోత మిగిల్చి..

లారీ ఢీకొని విద్యార్థి దుర్మరణం - ఘటనా స్థలిలోనే 5 గంటలపాటు ఆందోళన

ప్రజాశక్తి - తుళ్లూరు

వేసవి సెలవుల్లో తండ్రికి సాయంగా గేదెల వద్దకు వెళ్లిన విద్యార్థి ప్రమాదానికి బలయ్యాడు. రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు - రాయపూడి మధ్య లారీ ఢీ కొని 14 ఏళ్ల విద్యార్థి దుర్మరణం పాలైన ఘటన శుక్రవారం జరిగింది. స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన అంకం అభిషేక్‌బాబు మృత్యువాత పడడంతో ఆ కుటుంబం కన్నీరు మున్నీరవగా ఘటనపై ఆగ్రహించిన దళితులు 6 గంటలప్పుడు ఘటనా స్థలివద్దే ఆందోళనకు దిగారు. దీనిపై మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు.. తుళ్లూరు దళితవాడకు చెందిన అంకం నాని, మరియమ్మ దంపుతులకు కుమార్తె, కుమారుడు కాగా, కుమారుడు అభిషేక్‌బాబు స్థానిక జెడ్‌పి పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. శుక్రవారం సాయంత్రం 4 గంటల సమయంలో నాని తన కుమారుడు అభిషేక్‌బాబును బైక్‌పై ఎక్కించుకొని రాయపూడి వైపు నుంచి గేదెలను తోలుకుంటూ తుళ్లూరు వైపు వస్తూ పెట్రోల్ బంక్ వద్ద బైక్ దిగి గేదెలను తోలుతున్నాడు. ఆ సమయంలో అభిషేక్‌బాబు రోడ్డు మార్జిన్‌లో బైక్‌మీద కూర్చొని ఉండగా ఎదురుగా వస్తున్న మట్టి లారీ డీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదం జరిగిన వెంటనే లారీ డ్రైవర్ పరారైనట్లు నానీ తన ఫిర్యాదులో వివరించారు. అయితే ప్రమాదంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు విచారణ చేపట్టారు. ఇదిలా ఉండగా రాజధానిలో నిర్మాణ పనులకు మట్టిని తరలిస్తున్న లారీ ఈ ప్రమాదానికి కారణమవడంతో సంబంధిత పనులకు సంబంధించిన ప్రతినిధులు ఆందోళనకారులవద్దకు వచ్చి చర్చించారు. శనివారం ఓనర్ వచ్చి మాట్లాడి న్యాయం చేస్తారని చెప్పడంతో ఆందోళనను 11 గంటలకు విరమించి మృతదేహాన్ని తరలించారు.



మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు

ఉపాధ్యాయుల కోసం యుటిఎఫ్ హెల్ప్‌డెస్క్‌లు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

బదిలీలు, ప్రమోషన్లు కోసం దరఖాస్తు చేసుకునే సమయంలో తగుజాగ్రత్తలు తీసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని ఉపాధ్యాయులకు యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు సూచించారు. ఈ అంశంపై నరసరావుపేట పట్టణం రామిరెడ్డిపేటలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బదిలీల విషయంలో ఉపాధ్యాయులకు అవసరమైన దరఖాస్తు ప్రక్రియలో సలహాలు, సూచనలు అందజేసేందుకు హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం 770 ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయడం శుభపరిణామమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచేందుకు, విద్యా ప్రమాణాలు పెంచేందుకు యుటిఎఫ్ శ్రేణులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరెడ్డి, ఎం.మోహన్‌రావు, నాయకులు షేక్ ఖాసింపీరా, ఎ.భాగేశ్వరిదేవి, కె.తిరుపతిస్వామి పాల్గొన్నారు.



కంపెనీ ప్రతినిధులతో మాట్లాడుతున్న అజయ్‌కుమార్, ఇతర నాయకులు

రైతు సంఘాల చొరవతో పొగాకు కొనుగోలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పొగాకు కొనుగోలు చేయాలని రైతుసంఘాల ఆధ్వర్యంలో గత మూడు నెలలుగా వివిధ రూపాల్లో ఆందోళనల నేపథ్యంలో ఎట్టకేలకు ఇచ్చిన హామీ మేరకు పొగాకు కొనుగోలుకు కొన్ని కంపెనీలు ముందుకు వస్తున్నాయి. శుక్రవారం నంద్యాల జిల్లాకు చెందిన 12 మంది పొగాకు రైతులు తమ సరుకును తీసుకుని గుంటూరుకు సమీపంలోని పొత్తూరు వద్ద ఒక పొగాకు కంపెనీ వద్దకు చేరుకున్నారు. సమాచారం అందుకున్న ఎపి రైతుసంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కె.అజయ్‌కుమార్, రైతుకూలీ సంఘం రాష్ట్ర నాయకులు వి.నరసింహారావు రైతుల తరుపున కంపెనీ ప్రతినిధితో మాట్లాడారు. 12 మంది రైతులు తెచ్చిన దాదాపు 150 బేళ్లను కొనుగోలు చేసేలా చర్చించారు. అయితే ధర విషయంలో కంపెనీలు చాలా తక్కువగా నమోదు చేస్తుండటంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. రైతులకు అనుకూలమైన ధరలు వచ్చేలా కంపెనీ ప్రతినిధులతో చర్చించగా క్వింటాళ్‌కు గరిష్టంగా రూ.16 వేలు ధర లభించింది. కొన్ని ప్రాంతాల నుంచి వస్తున్న పొగాకు నాణ్యత లేకపోవడం వల్ల ధర తగ్గించాల్సి వస్తోందని కంపెనీ వారు చెప్పగా రైతుల బాధలను అర్థం చేసుకుని కొనుగోలు చేయాలని అజయ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. పొగాకు చేతికొచ్చి మూణ్ణెల్లయినా ఇప్పటివరకు కొనుగోలు చేయకపోవడం కంపెనీ తప్పుని, దీనివల్ల ఈ మూడు నెలల్లో వర్షాలు కారణంగా నాణ్యత తగ్గిందని, దీనికి బాధ్యత రైతులది కాదని వివరించారు. దీంతో రైతుకు ఆశాజనకమైన రేటు వచ్చినట్లు అజయ్‌కుమార్ తెలిపారు.



పవన్‌కల్యాణ్ నుండి అవార్డును అందుకుంటున్న ప్రొఫెసర్ సింహాచలం

ఎఎన్‌యు రిజిస్ట్రార్‌కు రాష్ట్రస్థాయి పురస్కారం

ఉత్తమ బయోడైవర్సిటీ కన్సర్వర్ అవార్డును డిప్యూటీ సిఎం నుండి అందుకున్న ప్రొఫెసర్ సింహాచలం

ప్రజాశక్తి - ఎఎన్‌యు

రాష్ట్ర బయోడైవర్సిటీ బోర్డ్ ఏటా అందించే ఉత్తమ బయోడైవర్సిటీ కన్జర్వర్ అవార్డుకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్, జువాలజీ, ఆక్వాకల్చర్ సీనియర్ ప్రొఫెసర్ జి.సింహాచలం ఎంపికయ్యారు. జువాలజీ, జీవవైవిధ్య సంరక్షణలో ఆయన చేసిన కృషికి ఈ అవార్డు లభించింది. రాష్ట్ర బయోడైవర్సిటీ బోర్డ్ ఆధ్వర్యంలో విజయవాడలో జరిగిన అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవంలో రాష్ట్ర పర్యావరణ శాఖ మంత్రి అయిన డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ నుండి అవార్డును సింహాచలం అందుకున్నారు. జలజీవుల సంరక్షణ, నూతన జాతులు ఆవిష్కరణ, పర్యావరణ పరిరక్షణ,

▶ 2లో

రేపు కొండపాటూరులో ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి - కాకుమాను

యార్లగడ్డ జయప్రద, రామయ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం కాకుమాను మండలం కొండపాటూరులో అప్పం ప్రైమరీ స్కూలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని ట్రస్ట్ బాధ్యులు యార్లగడ్డ అంకమ్మ చౌదరి, రైతు సంఘం నాయకులు రాజేంద్ర, శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు ఈ శిబిరంలో పాల్గొంటారని, ఉచిత పరీక్షలు, మందులు అందజేస్తారని, అవసరమైన వారికి కంటి శుక్లం ఆపరేషన్లు చేయించడం జరుగుతందని తెలిపారు. మండలంలోని ప్రజలు ఈ ఉచిత వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని ఆదివారం ఉదయం 9గంటల నుండి మద్యాహ్నం 1గంట వరకు శిబిరం కొనసాగుతుందని తెలిపారు.



పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న తహశీల్దార్

పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన తహశీల్దార్


ప్రజాశక్తి - తెనాలి

పదో తరగతి సప్లమెంటరీ పరీక్ష కేంద్రాన్ని తహశీల్దార్ కె.వి.గోపాలకృష్ణ శుక్రవారం పరిశీలించారు. రెగ్యులర్ విద్యార్థులకు, ఓపెన్ స్కూల్ విధానంలో పరీక్ష రాస్తున్న వారికి సప్లమెంటరీ పరీక్షలు ఏకకాలంలో నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో స్థానిక కోగంటి శివయ్య మున్సిపల్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. మండల విద్యాధికారి డాక్టర్ మేకల లక్ష్మీనారాయణ ద్వారా పరీక్ష కేంద్రాల వివరాలను, విద్యార్థుల హాజరు శాతం, పరీక్షలు నిర్వహిస్తున్న తీరుపై ఆరా తీశారు. సిబ్బందికి సూచనలు చేశారు. ఆయన వెంట ఎంఈవో లక్ష్మినారాయణ ఉన్నారు.

రేషన్ వాహనదారుల నిరసన

ప్రదర్శనకు అనుమతివ్వని పోలీసులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి : తమను విధుల నుంచి తొలగించినందుకు నిరసనగా శుక్రవారం గుంటూరులో రేషన్ వాహనదారులు ప్రదర్శనకు పూనుకోగా పోలీసులు అడ్డుకున్నారు. స్థానిక స్తంభాల గరువు జంక్షన్‌నుంచి కలెక్టరేట్ వరకు వాహనాలతో ప్రదర్శనకు వారు సిద్ధం కాగా అనుమతిలేదని పోలీసులు తెలిపారు. దీంతో వారు కొంత సేపు అక్కడే వాహనాలను నిలిపివేసి ముందుకు నడిచారు. తమ సమస్యలను వినకుండా,ఏమాత్రం సమయంకూడా ఇవ్వకుండా ఉన్న పళంగా వాహనాలను నిలిపివేయడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందస్తు సమాచారం, నోటీసులు కూడా లేకుండా తమను తొలగించడాన్ని వాహనదారులు తప్పుపట్టారు. మంచి ప్రభుత్వం అని చెప్పుకునే కూటమి నాయకులు ఎటువంటి చర్చలకుకూడా ఆహ్వానించకుండా ఒక్క కలం పోటుతో తమను తొలగించారని ఆరోపించారు.



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

సిపిఎం అభిమాని సుజాత కన్నుమూత

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఎం.టి.ఎం.సి పరిధిలోని ప్రాతూరు గ్రామానికి చెందిన డోకిపర్తి సుజాత (60) శుక్రవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె భర్త డోకిపర్తి భాస్కరరావు గతంలో సిపిఎం అభిమానిగా పార్టీ కార్యక్రమాలలో అమరజీవి డోకిపర్తి చలపతిరావుతో కలిసి పాల్గొనేవారు. భాస్కరరావు మరణానంతరం సుజాత వ్యవసాయ కార్మికురాలిగా జీవనం కొనసాగిస్తూ ఉండేది. సుజాత మరణ వార్త తెలుసుకున్న సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, సిపిఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు, దొంతిరెడ్డి వెంకటరెడ్డి ఆమె భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం గ్రామ కార్యదర్శి డోకిపర్తి రాజేంద్ర బాబు, డోకిపర్తి చిన్న, వైసిపి నాయకులు జంగం రత్తయ్య, టిడిపి గ్రామ అధ్యక్షులు అరవపల్లి శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, బ్రిడ్జి రాజు పాల్గొన్నారు.

మార్గదర్శకాల ప్రకారం రైస్‌కార్డుల్లో మార్పులు, చేర్పులు

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో రైస్ కార్డులకు సంబంధించి అందుబాటులోకి వచ్చిన నూతన కార్డుల మంజూరు, చిరునామాల మార్పు, కుటుంబ సభ్యుల చేర్పులు, విభజన, తొలగింపు, సరెండర్, అప్డేషన్ వంటి ఏడు సర్వీసుల దరఖాస్తులను నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం సక్రమంగా పరిష్కరించాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎ. భార్గవ్‌తేజ సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు. శుక్రవారం నగరపాలక సంస్థ పరిధిలోని గోరంట్ల 183వ వార్డు సచివాలయంలో జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఏ.భార్గవ్‌తేజ రైస్‌కార్డు దరఖాస్తుల సర్వీసులను పరిష్కరిస్తున్న ప్రక్రియను పరిశీలించారు. రైస్‌కార్డుల నూతన కార్డుల మంజూరు, స్ప్లిట్టింగ్, అడిషన్, డిలీషన్ , సరెండర్ తదితర సర్వీసుల దరఖాస్తులను రైస్‌కార్డు మాడ్యూల్‌లో నమోదు చేసే విధానాన్ని డేటా ప్రాసెసింగ్ సెక్రెటరీ కంప్యూటరులో జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఏ.భార్గవ్‌తేజ పరిశీలించారు. రైస్‌కార్డులకు సంబంధించి వివిధ సర్వీసుల దరఖాస్తులు అందించటానికి సచివాలయానికి వచ్చిన ప్రజలతో భార్గవ్‌తేజ మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. రైస్‌కార్డుల సర్వీసులకు సంబంధించిన దరఖాస్తులను ఆన్లైన్‌లో నమోదు చేసిన వెంటనే సంబంధిత కుటుంబ సభ్యుల ఈకేవైసీ చేసి క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరించేలా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జిల్లా పౌర సరఫరాల అధికారి చంద్రముని, తూర్పు మండల తహశీల్దారు సుభాని, సివిల్ సప్లయిస్ డీటీ భాస్కర్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



సచివాలయంలో దరఖాస్తును పరిశీలిస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టర్

సిహెచ్‌ఓల సమస్యలపై ప్రభుత్వం మౌనం వీడాలి

ప్రజాశక్తి - గుంటూరు : వైద్య ఆరోగ్యశాఖలో ఆరేళ్ల నుండి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లుగా గ్రామీణ ప్రాంతాలలో వైద్య సేవలు అందిస్తున్న తమ సమస్యలపై ప్రభుత్వం మౌనం వీడాలని సిహెచ్‌ఓల సంఘం జిల్లా అధ్యక్షురాలు టి.ప్రవల్లిక, చీఫ్ అడ్వైజర్ కొడాలి సృజన కోరారు. సిహెచ్‌ఓలు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారంతో 26వ రోజుకు చేరుకుంది. కలెక్టరేట్ వద్ద సమ్మె శిబిరంలో ప్రవల్లిక, సృజన మాట్లాడుతూ రెండేళ్లుగా సమస్యలు పరిష్కారం కాకపోవటంతో అనివా ర్యంగా సమ్మెలోకి వెళ్లామని, 26 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవట్లేదని అన్నారు. కార్యక్రమంలో జ్యోత్స్న, సాయి. భాస్కర్, వాసంతి, బాలకీర్తి, డి.ప్రవళిక. మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



సాగునీటిపై కొరవడిన శ్రద్ధ

(మొదటి పేజీ తరువాయి)

పరిధిలోని దాదాపు ఐదులక్షల ఎకరాల పంటలకు ఏటా ముంపు సమస్య వెంటాడుతోంది. కాల్వలల్లో పిచ్చిమొక్కలు, తూటాకు, గుర్రపు డెక్క పోరుకుపోయాయి. వీటిని తొలగించేందుకు వేసవిలోనే ప్రయత్నాలు జరగాల్సి ఉన్నా ఇంత వరకు పనులు చేపట్టలేదు. చిలకలూరిపేట ప్రాంతంలో కప్పగంజి వాగు, నాదెండ్ల మండలంలో మిట్టపాలెం వద్ద ఓగేరు, నక్కవాగు మొత్తంగా ఈ మూడు వాగులతో పెదనందిపాడు ప్రాంతంలో నల్లమడ వాగుగా రూపాంతరం చెందుతాయి. నల్లమడ వాగు ముంపు నివారణ పనులు ఇంత వరకు ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. చిలకలూరిపేట మండలం యడవల్లి నుంచి మొదలయ్యే ఓగేరు వాగు మిట్టపాలెం వద్ద కప్పగంజి వాగులో కలుస్తుంది. నాదెండ్ల మండలం చిరుమామిళ్ల నుంచి మొదలయ్యే నక్కవాగు తూబాడు, యడ్లపాడు, తర్లుపాడు తదితర గ్రామాల మీదుగా మిట్టపాలెం వద్ద కప్పగంజి వాగులో కలుస్తుంది. ఈ వాగులు పొంగినప్పుడు చిలకలూరిపేట నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పైర్లు ముంపునకు గురవుతున్నాయి. ఫిరంగిపురం మండలంలో ప్రారంభం అయ్యే మేళ్లవాగు పెదకూరపాడు మీదుగా అమరావతి మండలంలోకి ప్రవేశిస్తుంది. పరస, ఉంగుటూరు, ఎనికపాడు, నరకుళ్లపాడు, అమరావతి, పెదమద్దూరు మీదుగా ప్రవహించి వైకుంఠపురం వద్ద కృష్ణా కాల్వలో కలుస్తుంది. భారీ వర్షాలు కురిస్తే ఈ ప్రాంతాలన్నీ ముంపునకు గురవుతాయి. సత్తెనపల్లి నియోజకవర్గం పాకాలపాడు వైపున నుంచి వచ్చే ఎద్దువాగు క్రోసూరు, బయ్యవరం, మునుగోడు, పొందుగల మీదుగా కృష్ణానదిలో వెళ్తుంది. భారీ వర్షం కురిస్తే పలు ప్రాంతాల్లో పైర్లకు నష్టం వాటిల్లుతుంది. నల్లమడ, గుంటూరు డ్రెయిన్ల సమస్య ఇంత వరకు అధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టి సారించడం లేదు. ప్రధానంగా నిధులు సమస్య వల్ల ఏమీ చేయలేకపోతున్నామని వారు నర్మగర్భంగా చెబుతున్నారు.

ఎఎన్‌యు రిజిస్ట్రార్‌కు రాష్ట్రస్థాయి పురస్కారం

(మొదటి పేజీ తరువాయి)

చిత్తడి నేలల పునరుద్ధరణ ఆయన అందించిన విస్తృత సేవలను గుర్తించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2025 సంవత్సరం నాటి జీవవైవిధ్య కన్జర్వర్ అవార్డును ప్రధానం చేసింది. ఆయనకు వీసీ గంగాధరరావు, రెక్టార్ రత్నషీలామణితో పాటు ఇతర అధికారులు, అధ్యాపక, అధ్యాపకేతర ఉద్యోగులు, పరిశోధకులు, విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు.

వర్సిటీలో విద్యార్థిగా ఎమ్మెస్సీ జువాలజీలో పీజీతో పాటు పీహెచ్డీ పరిశోధనలు పూర్తిచేసి అదే విభాగంలో అధ్యాపకుడిగా వృత్తిని ఆరంభించిన ఆయన బోధనతోపాటు పరిశోధకులకు మెరుగైన పరిశోధనలు అందిస్తూ పలువురికి ఎంఫిల్, పిహెచ్డి డిగ్రీలు అందించారు. జల జీవజాతుల అభివృద్ధికి పరిశోధనలు చేశారు. క్లామ్ రొయ్యలలో అనేక నూతన జాతులను ఆవిష్కరించడంతోపాటు వాటి సంరక్షణపై చేసిన పరిశోధనలను, ఆవిష్కరణలను ప్రతిష్టాత్మక న్యాచురల్ హిస్టరీ మ్యూజియంలో భద్రపరిచారు. చిత్తడి నేలల సంరక్షణలో ఆయన కృషి ప్రఖ్యాత పర్యావరణ సంస్థల నుండి గుర్తింపు పొందింది. ఆసియాలోనే అతిపెద్ద మంచినీటి సరస్సుగా పేరు పొందిన కొల్లేరులో సుమారు 16 చేప జాతులపై ఆయన పరిశోధన చేసి, వాటిని సంరక్షించడానికి వీలుగా డీఎన్ఏ సీక్వెన్సీ, జీన్ బ్యాంకులు తయారీలో పాటుపడ్డారు. కొల్లేరులో సుమారు 92 చేప జాతుల సంరక్షణ కోసం కృషి చేశారు. తీర ప్రాంత జీవవైవిధ్యాన్ని దానిపైన ఆధారపడిన వర్గాల అభ్యున్నతికి ప్రత్యేక ప్రణాళికలను రూపొందించారు. ఆంధ్రప్రదేశ్ గనుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరిపిన ప్రకాశం బ్యారేజ్ ఎగువ కృష్ణానది తీరంలో వృక్షజాతులు, జంతు జాతులుపై పర్యావరణ ప్రభావం అనే అంశంపై పరిశోధన చేసి నివేదిక సమర్పించారు. జీవవైవిధ్య సంరక్షణపై 70కి పైగా అంతర్జాతీయ జర్నల్స్‌లో పరిశోధన పత్రాలు ప్రచురించడంతో పాటు 51 జాతీయ, 19 అంతర్జాతీయ సదస్సుల్లో కీలక ఉపన్యాసాలు చేసి పరిశోధన పత్రాలు సమర్పించారు. జీవవైవిధ్య సంరక్షణపై రెండు ప్రభుత్వ ప్రాజెక్టుల్లో క్రియాశీలకంగా వ్యవహరించారు.

రానున్న అయిదేళ్లలో రూ.100 కోట్ల రుణాల మంజూరే లక్ష్యం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రానున్న అయిదేళ్లలో ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ నరసరావుపేట శాఖ ఆధ్వర్యంలో రూ 100 కోట్ల ఋణాలు మంజూరు చేయడమే లక్ష్యమని బ్యాంక్ డైరెక్టర్ జెవి సత్యనారాయణ మూర్తి అన్నారు. శుక్రవారం నరసరావు పేట పట్టణంలోని జి.ఎల్.ఆర్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన సభ్యుల సభకు బ్యాంక్ వైస్ చైర్మన్ ఎం.రాఘవ రావు అధ్యక్షత వహించిన సభలో ఆయన మాట్లాడుతూ నరసరావుపేటలో శాఖ ప్రారంభించిన 9 నెలల కాలంలో రూ 5 కోట్ల వివిధ రుణాలు మంజూరు చేశామన్నారు. రూ 1.72 కోట్ల డిపాజిట్లు వచ్చాయన్నారు. డిపాజిట్ల సేకరణ, రుణాల వసూళ్ల శాఖ పరిధిలో సంతృప్తిగా ఉన్నాయన్నారు. రుణాలు పొందిన ఖాతా దారులు సకాలంలో చెల్లించడం ద్వారా తమ బ్యాంకు లక్ష్యాల ను చేరుకుంటుందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం మొండి బకాయిలు సున్నా శాతమన్నారు. 1983 లో మానం ఆంజనేయులు చైర్మన్‌గా ఉన్న సమయంలో రాష్ట్రంలోని సహకార అర్బన్ బ్యాంకులు నిలదొక్కుకున్నాయని వాటిని విస్తరింప చేయడంలో ఆయన పాత్ర కీలకమన్నారు. సామాన్య ప్రజలకు సేవలను అందించడంతో పాటు సులభ రీతిలో రుణాలు మంజూరు చేస్తుందన్నారు. జోనల్ మేనేజర్ ఎన్.ఎస్.ఆర్ మూర్తి, డైరెక్టర్లు ఆచార్య ఎన్ అంజయ్య, బ్రాంచ్ మేనేజర్ బంగారుబాబు పాల్గొన్నారు.

వైసిపి పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులుగా పచ్చవ రవీంద్రబాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వైసిపి పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులుగా ఆ పార్టీ సీనియర్ నాయకులు రొంపిచర్ల మండలం అన్నవరం గ్రామానికి చెందిన పచ్చవ రవీంద్ర బాబు నియమితులయ్యారు. ఈ మేరకు వైసిపి రాష్ట్ర కేంద్ర కార్యాలయం నుండి శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. రవీంద్ర బాబు వైసిపి ఆవిర్భావం నుండి పార్టీలో కొనసాగారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డితో సన్నిహితంగా ఉంటూ నరసరావుపేట నియోజకవర్గంలో వైసిపిలో కీలక నేతగా ఎదిగారు. రొంపిచర్ల మండల పార్టీ అధ్యక్షునిగా వైసిపి బలోపేతానికి ఎంతో కృషి చేశారు. వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ ఛైర్మన్‌గా రైతులకు కుల, మత పార్టీలకతీతంగా విశేష సేవలు అందించారు. ఈ సందర్భంగా రవీంద్ర బాబు మాట్లాడుతూ వైసిపిలో కష్టపడిన వారికి గుర్తింపు లభిస్తుందని చెప్పడానికి తానొక నిదర్శన మన్నారు. తనకు లభించిన పదవి పార్టీ పట్ల, కార్యక్రమాల నిర్వహణ పట్ల తన బాధ్యత మరింత పెంచిందన్నారు. తన నియామకానికి సహకరించిన వైసిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణా రెడ్డి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

రాజధానిలో తిరంగా ర్యాలీ

ప్రజాశక్తి - తుళ్లూరు

అమరావతి రాజధాని పరిధిలోని తుళ్లూరులో కూటమి నాయకులు శుక్రవారం తిరంగా ర్యాలీ నిర్వహించాయి. స్థానిక గ్రంథాలయం సమీపంలోని అంబేద్కర్ విగ్రహం నుంచి ప్రధాన రహదారుల మీదుగా తిరంగా ర్యాలీ సాగింది. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. తులసి థియేటర్ సెంటర్ వద్ద సుభాష్ చంద్రబోస్ కి విగ్రహానికి పూలమాలవేసి భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా త్రివిధ దళాలకు మద్దతుగా ర్యాలీ చేపట్టినట్లు నేతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దామినేని శ్రీనివాసరావు, కాటా అప్పారావు,కట్టా నరసింహారావు,పువ్వాడ సుధాకరరావు, సరిపూడి సాంబశివరావు,నీరుకొండ లక్ష్మీనారాయణ, యర్రగోపు నాగరాజు, కంతేటి బ్రహ్మయ్య,మహిళా రైతులు పాల్గొన్నారు.

కులగణన ప్రక్రియను వేగవంతం చేయాలి : కేసన

ప్రజాశక్తి - మంగళగిరి

కేంద్ర మంత్రిమండలి కులగణనకు ఆమోదం తెలుపుతూ విధాన నిర్ణయం తీసుకొని కూడా, విధి విధానాలు రూపొందించ కుండా జాప్యం చేయడం తగదని, సమగ్ర కుల గణన ప్రక్రియను వేగవం తంగా పూర్తి చేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలోని ప్రతిపక్షాలు, ముఖ్యంగా వెనుకబడిన తరగతులకు చెందిన ప్రజల ఆకాంక్షల మేరకు, జాతీయస్థాయిలో అన్ని రాష్ట్రాల ఓబీసీ సంఘాలు జరిపిన పోరాటాల ఫలితంగా ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం కుల గణనకు ఆమోదం తెలపడం సంతోషదాయకమని తెలిపారు. మంత్రి మండలి విధాన నిర్ణయాన్ని పార్ల మెంటు ఆమోదంతో, చట్టబద్ధంగా ఈసారి జాతీయ స్థాయిలో జనగణనతో పాటు సమగ్రంగా కుల గణన నిర్వహించాలని పేర్కొన్నారు. సేకరిం చిన మొత్తం డేటాను పారదర్శకంగా దేశ ప్రజలకు తెలియజేయాలన్నారు.

మద్యం దుకాణాలు సమయపాలన తప్పనిసరి

ఉల్లంఘిస్తే కఠిన చర్యలు : ఎక్సైజ్ డిసి శ్రీనివాసులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



మద్యం దుకాణాలకు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటలవరకు మాత్రమే అనుమతి ఉందని ఎక్సైజ్, ప్రొహిబీషన్ శాఖ డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాసులు తెలిపారు. గుంటూరులోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం మద్యం దుకాణాల్లో విక్రయాలు మాత్రమే జరపాలని అక్కడి తాగడానికి అనుమతి లేదన్నారు. పర్మిట్ రూంకు అవకాశం లేదన్నారు. రాత్రి 10 గంటలకు ప్రతిదుకాణం ముందు ఒక కానిస్టేబుల్‌ను కాపాలగా ఉంచి దుకాణం మూసిన వెంటనే ఫోటో తీసి తమ గ్రూపులో పెట్టాలని ఆదేశించామన్నారు. నైట్ పెట్రోలింగ్ పెంచామన్నారు. మద్యం విక్రయాల వల్ల శాంతి భద్రతలసమస్యలు రాకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటుందన్నారు. అందువల్ల నిర్ధేశిత సమయాలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. బార్లు మాత్రం ఉదయం 11 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు అనుమతి ఉందన్నారు. దుకాణాల సమయపాలనపైపర్యవేక్షించడానికి టాస్కుఫోర్సు, జిల్లా అధికారుల ఆధ్వర్యంలో బృందాలను ఏర్పాటు చేశామన్నారు. గత ఏడాది అక్టోబరు 10 నుంచి ఈనెల 22 వరకు గుంటూరు,పల్నాడు జిల్లాల్లో మద్యం అక్రమ వినియోగం, అనుమతిలేకుండా తాగడంపై 1900 కేసులు నమోదు చేశామన్నారు. 1201 మందిని అరెస్టు చేశామన్నారు. 2297 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. అలాగే 119 లీటర్ల బీరు స్వాధీనం చేసుకున్నామని, 444 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని 54,900 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామన్నారు. 2.89 కిలోల గంజాయిని పట్టుకున్నామన్నారు. 12 కేసులు నమోదు చేశామన్నారు. 23మందిని అరెస్టుచేసినట్టు తెలిపారు. బెల్టు షాపులకు సంబంధించి మొత్తం 760 కేసులు నమోదు చేసి 762 మందిని అరెస్టు చేసినట్టు తెలిపారు. 1686 లీటర్ల మద్యం, 5 లీటర్ల బీరును బెల్టుషాపులలో స్వాధీనం చేసుకున్నామన్నారు. డ్రగ్స్‌కు సంబంధించి మూడు కేసులు నమోదు చేసి 17 మందిని అరెస్టు చేసినట్టు వెల్లడించారు. విలేకరుల సమావేశంలో జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారులు ఎన్.రవికుమార్‌రెడ్డి, ఎస్ఎం. భాష పాల్గొన్నారు.

వ్యర్థాల సేకరణదారులకు నమస్తే స్కీమ్ ప్రొఫైలింగ్

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో శుక్రవారం వ్యర్థాలు సేకరించే వారికి నమస్తే స్కీమ్ ప్రొఫైలింగ్ కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ బి శేషన్న అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వ్యర్థాలు సేకరించే వారికి అవగాహన కల్పించారు. హెయిర్ పిక్కర్లు, ఉల్లిపాయలకి పాత ఇనుము, ప్లాస్టిక్ డబ్బాలు సేకరించే వారికి నమస్తే ప్రోగ్రామ్ గురించి, ఐడి కార్డులు, హెల్త్ కార్డులు, పిపి కిట్స్, వారి పిల్లలకు ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు ప్రీ మెట్రిక్ స్కాలర్షిప్ వంటి పథకాలను వివరించారు. వారి జీవితాల్లో మార్పు తెచ్చేందుకు, పోస్టల్ ఖాతా ప్రారంభించే విధానం, ఖాతాకు ఆధార్, మొబైల్ లింక్ చేయడం, తద్వారా లభించే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక,



మాట్లాడుతున్న కమిషనర్ శేషన్న

అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి, హెల్త్ ఆఫీసర్ హెలెన్ నిర్మల, స్వచంద్ర కార్పొరేషన్ కోఆర్డినేటర్ అనిల్‌కుమార్, దళిత బహుజన రిసోర్స్ సెంటర్ స్టేట్ కో ఆర్డినేటర్ హేమలత, జిల్లా కోఆర్డినేటర్ నిర్మల, రజనీ, పోస్టల్‌కు సంబందించి లిఖిత్, వార్డు సెక్రటరీ వినీల్ , సర్వేయర్స్ పాల్గొన్నారు.

సిఐపై వైసిపి నాయకుల ఆగ్రహం

తంగెడలో కార్యకర్తకు చిత్రహింసలు

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

గురజాల సబ్ జైలులో ఉన్న వైసిపి కార్యకర్త ఉప్పుతల హరికృష్ణను గుంటూరు, పల్నాడు జిల్లాల వైసిపి నాయకులు శుక్రవారం ములాఖత్ ద్వారా పరామర్శించారు. మాజీమంత్రి అంబటి రాంబాబు, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బొల్లా బ్రహ్మ నాయుడు, గజ్జల సుధీర్ రెడ్డి, చింతలపూడి అశోక్, కె.వి.మురళీ ధర్ రెడ్డి హరికృష్ణను పరామర్శించారు. దాచేపల్లి మండలం తంగెడ గ్రామానికి చెందిన ఉప్పుతల ఎల్లయ్య కుమార్డు హరికృష్ణని దాచేపల్లి సిఐ భాస్కరరావు దారుణంగా కొట్టి కోర్టులో హాజరు పరిచారని అంబటి రాంబాబు ఆరోపించారు. కోర్టు హరికృష్ణకు రిమాండ్ విధించిందని తెలిపారు. హరికృష్ణను సిఐ భాస్కరరావు చెప్పలేని విధంగా కొట్టారని ఆరోపించారు. టిడిపి నాయకుడు జానీబాషా కారులో హరికృష్ణను తరలించారని ఆరోపించారు. సిఐ భాస్కర్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేయాలన్నారు. సిఐ భాస్కరరావుపై చర్యలు తీసుకోకపోతే న్యాయపోరాటం చేస్తామన్నారు. ఆయనను సస్పెండ్ చేయాలని వైసిపి నాయ కులు డిమాండ్ చేశారు. హరికృష్ణ తండ్రి ఉప్పుతల యల్లయ్య మాట్లాడుతూ తమ కుమారున్ని పోలీసులు పట్టుకుని తీవ్రంగా హింసించారని తెలిపారు. హరికృష్ణ భార్య భార్గవి మాట్లాడుతూ పోలీసులు చిత్రహింసలకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ తప్పు చేయకపోయినా రాజకీయ కక్షతో చిత్రహింసలు పెడుతున్నారని తెలిపారు. తనకు ముగ్గురు పిల్లలు అని తన భర్తను కాపాడాలని కోరారు.

శారద సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో హెల్త్ ఆన్ వీల్స్

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక రామకష్ణ కవి కళాక్షేత్రంలో శుక్రవారం తక్కెళ్ళపాడు కిమ్స్ చక్ర వైద్యశాల, పట్టణానికి చెందిన శారద సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో హెల్త్ ఆన్ వీల్స్ పేరిట క్యాన్సర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ చైర్ పర్సన్ నన్నపనేని రాజకుమారి పాల్గొన్నారు. కార్యక్రమ బ్రోచర్ను ఆవిష్కరించారు. రోగులకు థైరాయిడ్, బిపి, షుగర్, ప్యాప్స్మియర్ టెస్టులు నిర్వహించి, ఆయా వ్యాధులు రాకుండా ముందుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను, వ్యాధి సంక్రమించిన వారు పాటించాల్సిన చికిత్స



కార్యక్రమ బ్రోచర్ ఆవిష్కరణలో రాజకుమారి, డాక్టర్ శారద

విధానాలను డాక్టర్ శారద వివరించారు. కార్యక్రమంలో శారద సర్వీసెస్ సొసైటీ బందం, కిమ్స్ చక్ర వైద్యశాల వైద్యులు పాల్గొన్నారు.

ఆరు ట్రాక్టర్లు సీజ్

ప్రజాశక్తి - దుగ్గిరాల

రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ నియోజక వర్గంలోని దుగ్గిరాల మండల ప్రజలు ఉచిత ఇసుకకు నోచుకోవటం లేదు. ప్రక్క మండలాలలో నీ సచివాలయాలలో టోకెన్లు జారీ చేసి ఉచిత ఇసుకను అధికారపక్ష నాయకుల కనుసన్నలలో సరఫరా జరుగుతోంది. కానీ దుగ్గిరాల మండల పరిధిలో వీర్లపాలెం పెద్ద కొండూరు గొడవర్రు రీచ్‌లలో ఉచిత ఇసుక పథకం అమలు జరగటం లేదు. దీనితో పెద్ద కొండూరు గ్రామానికి చెందిన ట్రాక్టర్ యజమానులు ఇసుక త్రవ్వకాలకు పాల్పడుతున్నారు. స్థానిక ఎస్సై ఆధ్వర్యంలో శుక్రవారం దాడి చేసి ఆరు ట్రాక్టర్లను సీజ్ చేశారు. ప్రక్క మండలాల నుండి ఇసుక తీసుకువచ్చి తమ మండలంలో సరఫరా చేస్తున్నారని దుగ్గిరాల మండలంలో ఉచిత ఇసుక పాలసీ ఎందుకు అమలు కావడం లేదని ట్రాక్టర్ యజమానులు డ్రైవర్లు వాపోతున్నారు. సకాలంలో కిస్తీలు కట్టకపోతే ఫైనాన్సర్లు ట్రాక్టర్లను తీసుకెళ్తారని ట్రాక్టర్ల యజమానులు బాడుగ లేక పోతే ఓనర్ తమకు జీతం ఇవ్వడని డ్రైవర్లు ఒకింత ఆందోళనకు గురవుతున్నారు. ఈ పథకం దుగ్గిరాల మండలంలో ఎందుకు అమలు కావటంలేదని తెలుసుకునేందుకు ప్రయత్నించగా రెవెన్యూ శాఖ అధికారులు అందుబాటులో లేరు.

ఉపాధి హామీ కూలీల సమస్యల్ని పరిష్కరించాలి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని ఏపీ మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని వేలూరు గ్రా మంలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలను కలసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నిర్మల మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేలా వ్యవహ రిస్తున్నాయని మండిపడ్డారు. ఇప్పటికే రెండు నెలలు కావొస్తున్నా పనిచేసిన కూలీలకు సకాలంలో వేతనాలు ఇవ్వలేదన్నారు. మరోపక్క ఉపాధి కూలీలకు చట్ట ప్రకారం 15 రోజులకు ఒకసారి వేతనం, పేస్లిప్ ఇవ్వాలని చట్టంలో ఉన్నా దానిని అమలు చేయడం లేదన్నారు. గతంలో వేసవి అలవాన్సు పెంచి ఇచ్చే వారిని, ప్రస్తుతం ఎటువంటి వేతనాలు పెంచలేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేశారన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మికసంఘం నాయకులు చౌటుపల్లి నాగేశ్వరరావు, మహిళా కూలీలు పాల్గొన్నారు.

గుడిలో చోరీ కేసులో నిందితులు అరెస్టు

ప్రజాశక్తి - తెనాలి

రూరల్ గ్రామం కొలకలూరు పంచాయతీ పరిధిలోని ఖాజీపేట లక్ష్మీ మైసమ్మ తల్లి గుడిలో జరిగిన దొంగతనం కేసులో నిందితులను రూరల్ పోలీసులు శుక్రవారం మ్యాజిస్ట్రేట్ ముందు హాజరు పరిచారు. వారి వివరాల ప్రకారం ఈనెల 2వతేదీ అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని దొంగలు గుడి ప్రధాన ద్వారం తాళాలు పగలగొట్టి, అమ్మవారి వెండి కిరీటము, బంగారు మంగళసూత్రాలు, మరికొన్ని వస్తువులను దొంగతనం చేశారు. గుడి నిర్వాహకులు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసుల విచారణలో ముద్దాలైన ఐదుగురిని నల్లపాడు పోలీసులు అరెస్టు చేశారు. వారు నేరాన్ని అంగీకరించడంతో నిందితులను పిటి వారంట్‌పై గుంటూరు సబ్ జైలు నుంచి తీసుకువచ్చిన తెనాలి రూరల్ పోలీసులు మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచారు. నిందితులకు మెజిస్ట్రేట్ 15 రోజులు రిమాండ్ విధించారు. ఈ కేసులో నిందితుల నుంచి వెండి కిరీటం స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్రం మిర్యాలగూడకు చెందిన నార్సింగ గంగాధర్, నార్సింగ్ మహేష్, పలనాడు జిల్లా పెదకూరపాడు మండలం చెందిన వేమవరపు విద్యాసాగర్, తెనాలి టౌన్ సిబిఎన్ కాలనీకి చెందిన కారంపూడి విజయ్ కుమార్, బాపట్ల జిల్లా రేపల్లెకి చెందిన పుట్ట వెంకటేష్ పోలీసులు అరెస్టు చేసిన వారిలో ఉన్నారు. ఈ ఐదుగురు గతంలో నేరాలు చేసి జైలుకు వెళ్లినవారే. అక్కడి పరిచయాలతో జైలు నుండి విడుదలయ్యాక మళ్లీ నేరాలు చేస్తున్నారని తెలిపారు.

ప్రమాద సూచికగా చీర!

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రత్తిపాడు మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద పైప్ లీక్ అయింది. మరమత్తులు చేసేందుకు క్రేన్ పెట్టి కుంట తీశారు. అయితే పాత మద్రాసు రోడ్డు, మరొక వైపు గొట్టిపాడు నుండి వాహనాలు కూడా అనునిత్యం వాహనాలు తిరుగుతూ ఉంటాయి. గతంలో భార్య భర్త ద్విచక్ర వాహనంపై వస్తూ సరిగ్గా టర్నింగ్ వద్ద జారి పడి వెంటనే వెనక బస్సు ఆమెపై ఎక్కడంతో ఒక మహిళ ప్రాణాలు పోయాయి. ప్రమాద కుంట తవ్వారు. ప్రమాద సూచికకు చీర కట్టారు. ఏదైనా జరగరాని సంఘటన జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రజలు వాపోతున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి - తెనాలి రూరల్



మృతి చెందిన సుఖాని

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారు వెల్లడించిన వివరాల ప్రకారం రూరల్ గ్రామం అంగలకుదురుకు చెందిన షేక్ సుఖాని (24) శుక్రవారం తెల్లవారుజామున ఇంటి నుంచి తెనాలి రైల్వే స్టేషన్‌కు తన స్నేహితుడి కోసం మోటార్ సైకిల్‌పై వెళుతూ రోడ్డు పక్కన ఆగి ఉన్న టిప్పర్ లారీను వెనుక నుంచి ఢీ కొట్టాడు. ప్రమాదంలో తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని తల్లి హిదయ తుల్లా ఇచ్చి న ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

మున్సిపాల్టీలో గ్రామాల విలీన సమస్యకు త్వరలో పరిష్కారం

- గణపవరంలో పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కృష్ణతేజ పరిశీలన
- గ్రామస్తుల నుండి సమస్యలు విని పరిష్కారానికి ఆదేశం

ప్రజాశక్తి- చిలకలూరిపేట

గణపవరం, పసుమర్రు. మానుకొండవారిపాలెం గ్రామాలు మున్సిపాల్టీలో విలీనంపై రెండు మూడు నెలల్లో పరిష్కారం లభిస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ మైలవరపు కృష్ణతేజ చెప్పారు. గణపవరం గ్రామాన్ని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుతో కలిసి ఆయన శుక్రవారం సందర్శించారు. గ్రామంలో మరమ్మత్తులకు గురైన తాగునీటి ఫిల్టర్‌ను పరిశీలించి మరమ్మతు కోసం రూ.32 లక్షలు ఖర్చవుతుందని అంచనా వేశారు. అయితే గ్రామాలు మున్సిపాల్టీలో విలీనంపై కోర్టు స్టే కారణంగా నిధులు విడుదల కావటం లేదని, పన్నుల ద్వారా వచ్చిన ఆదాయం సిబ్బంది జీతభత్యాలకే సరిపోతోందని పంచాయతీ కార్యదర్శి మారుతీబాబు వివరించారు. కృష్ణతేజ స్పందిస్తూ రూ.32 లక్షల్లో మూడోంతులు జెడ్‌పి ద్వారా విడుదల చేయిస్తామని, మిగతా మొత్తాన్ని మండల పరిషత్ విధుల నుండి విడుదల చేయాలని ఎంపిడిఒ స్వరూపరాణిని ఆదేశించారు. మూడు గ్రామాల్లో ఎదుర్కొంటున్న సమస్యలను స్థానిక నాయకులు వివరించారు. మానుకొండవారిపాలెం వాటర్‌ట్యాంక్ కూలిపోయే దశలో ఉందని చెప్పగా నూతన ట్యాంక్ నిర్మాణానికి ఆదేశించారు. గణపవరంలో కూలీలు ఉపాధి హామీ పనులు కోల్పోయారని, ఈ మూడు గ్రామాల్లో కొత్త రేషన్కార్డులు జారీ, మార్పులు, చేర్పులకు లాగిన్లు ఓపెన్ కావటం లేదని స్థానికులు తెలిపారు. గణపవరం పంచాయతీలో పర్మినెంట్ అయిన అరుగురు సిబ్బందికి, తొమ్మిది నెలలుగా వేతనాలు రావటం లేదన్నారు.



ఎమ్మెల్యే పుల్లారావుతో కలిసి ఫిల్టర్ బెడ్‌ను పరిశీలిస్తున్న కృష్ణతేజ

గణపవరం జెడ్‌పి పాఠశాల సమీపంలోని అంబేద్కర్ కాలనీకి వెళ్లే మార్గంలో రోడ్డుకు తమ స్వంత భూమి కొంత పోతుందని, నష్టపరిహారం ఇప్పించాలని శివకుమార్ కోరగా అంచనా రూపొందించాలని పంచాయతీ అధికారులను కృష్ణతేజ ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ జ్యోతిబసు, డిపిఒ నాగేశ్వరనాయక్, తహశీల్దార్ రమణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ అనంతరాజు, శ్రీనివాసరావు, కౌన్సిలర్లు జి.శ్రీనివాసరావు, జె.సుబ్బారావు, నాయకులు వెంకటేశ్వర్లు, హనుమంతరావు, అచ్చయ్య, శ్రీనివాసరావు, సదాశివరావు, మధన్‌మోహన్ పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నీ విజేతలుగా ఎస్ఆర్ఎం జట్లు

ప్రజాశక్తి - వెల్దుర్తి





క్రీడల్లోనూ యువత ఆసక్తి కలిగి ఉండాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. మాచర్ల నియోజక వర్గంలో క్రీడ పట్ల ఆసక్తి ఉన్న వారిని ప్రోత్సహిస్తామన్నారు. మండల పరిధిలోని శిరిగిరిపాడులోని శ్రీ వీరాంజనేయస్వామి వారి తిరునాళ్ల సందర్భంగా నాలుగు రోజుల పాటు నిర్వహించిన ఆల్ ఇండియా పురుషులు, మహిళల వాలీబాల్ టోర్నమెంట్ ఫైనల్స్ గురువారం రాత్రి ముగిశాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే బహుమతులను ప్రదానం చేశారు. ఎస్ఆర్ఎం పురుషుల జట్టు ప్రథమ స్థానం సాధించగా రూ.లక్ష నగదు, మెడల్స్, ట్రోఫీని అందజేశారు. మహిళా విభాగంలో విజేతగా నిలిచిన ఎస్ఆర్ఎం మహిళా జట్టులకు రూ.75 వేల నగదు, మెడల్స్, ట్రోఫీని అందజేశారు. రన్నర్‌గా ఐవోబీ పురుష జట్టు, సదరన్ రైల్వే మహిళా జట్లు నిలిచాయి.

స్వయం ఉపాధితోనే మహిళలు రాణిస్తారు

స్వయం ఉపాధితోనే సమాజంలో మహిళా శక్తి ఇంకా బలపడుతుందని ఎమ్మెల్యే అన్నారు. స్థానిక జెడ్‌పి పాఠశాలలో బిసి కార్పొరేషన్ ద్వారా ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. మహిళలకు ఆర్థిక స్వావలంబన, సాధికారిత చేకూర్చినప్పుడే వారు సమాజంలో ఎదుర్కొంటున్న వివక్షతను అధిగమించగలరని చెప్పారు.

అప్రకటిత విద్యుత్ కోతలతో వృత్తిదార్ల ఉపాధికీ కోత

సాధారణ ప్రజలకూ అవస్థలు

గ్రామాల్లో అధికంగా సమస్య

ప్రజాశక్తి-చిలకలూరిపేట

అనధికార విద్యుత్ కోతలు అధికమై చేతివృత్తుదార్ల జీవనోపాధిని దెబ్బతిస్తోంది. మరోవైపు వేళాపాళా లేకుండా విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో జనం అల్లాడుతున్నారు. పట్టణంలో చిన్న పరిశ్రమలతోపాటు వెల్డింగ్, కుట్టు మిషన్లు, కార్పెంటర్లు, కూల్ డ్రింక్స్ షాపుల వారు, పంచ్చర్ షాపులవారు వందల సంఖ్యలో ఉన్నారు. వీరితోపాటు ఎలక్ట్రీషియన్లు, తాపీ వర్కర్లు సైతం విద్యుత్ కోతల ప్రభావానికి గురవుతున్నారు. చెక్కపని, వెల్డింగ్ పనులు నిలిచి తాము పనిచేయడానికీ వీలవడం లేదని భవన నిర్మాణ కార్మికులు చెబుతున్నారు. రోజుకో సాకుతో విద్యుత్ సరఫరాను ఆపేస్తున్నారని, కొన్ని ప్రాంతాల్లో రెండు గంటల వరకూ కోత ఉంటోందని అసహనం వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ కోతలు మరింత ఎక్కువగా ఉండడంతో కుటు మిషన్లపై పనులు సాగడం లేదు. అనుకున్న సమయానికి డ్రస్సులు ఇవ్వలేక కష్టమర్ల నుండి మాటలు పడుతున్నామని, ఆదాయమూ కోల్పోతున్నామని టైలర్ సి.హెచ్ లక్ష్మీ వాపోయారు. ఇంత జరుగుతున్నా విద్యుత్ బిల్లులు మాత్రం ఎక్కువగానే వస్తున్నాయని నిట్టూరుస్తున్నారు.

సిహెచ్‌ఓల సమ్మెకు సిఐటియు సంఘీభావం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

చాలీచాలని వేతనాలతో విశేష సేవలు అందిస్తున్న సిహెచ్‌ఓల సమస్యలు పరిష్కరించి పేదలకు సరైన వైద్య సేవలు అందేలా చూడాలని సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్ డిమాండ్ చేశారు. ఆయుష్మాన్ భారత్ ద్వారా పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు నరసరావుపేట పట్టణంలోని గాంధీ పార్క్ వద్ద చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం 26వ రోజుకు చేరుకుంది. సమ్మె శిబిరాన్ని సందర్శించిన ఆంజనేయులు నాయక్ వారికి మద్దతుగా మాట్లాడుతూ ఇన్ని రోజులుగా వారు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం, వైద్యారోగ్య శాఖ అధికారులు స్పందించకపోవడం తగదన్నారు. ఆరేళ్ల సర్వీస్ పూర్తయిన వారిని క్రమబద్ధీకరించాలని, ఇంక్రిమెంట్లతో పాటు పిఎఫ్ చెల్లించాలని కోరారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ల కరెంటు బిల్లులు, అద్దె బకాయిలు చెల్లించాలన్నారు. ఆయుష్మాన్ భారత్, రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖల కింద విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో సిహెచ్‌ఓల విశేష సేవలున్నాయని వివరించారు. 2023లో ఎన్.హెచ్.ఎం ఉద్యోగులకు 23 శాతం వేతన సవరణ ఇచ్చి సిహెచ్.ఓలకు వేతన సవరణలు చేయలేదని గుర్తు చేశారు. ప్రతినెలా ఇవ్వాల్సిన ప్రోత్సాహాలు ఇవ్వకుండా తీవ్ర జాప్యం చేయడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

సిహెచ్‌ఓల సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.అనుపమ, ఉపాధ్యక్షులు కె.వినోథ్, జిల్లా కో ఆర్డినేటర్ బి.సాగర్, ప్రధాన కార్యదర్శి రాము మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు తమ శిబిరం వద్దకు వచ్చి డిమాండ్లు విని వెళ్లిపోయారని, అనంతరం ఎవరూ స్పందించలేదని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 361 మంది పనిచేస్తున్నామని, ఏడేళ్ల నుండి కాంట్రాక్ట్ ఉద్యోగులుగా చేస్తున్నామని, నిబంధనల ప్రకారం తమను పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని అన్నారు. 23 శాతం వేతన సవరణ చేయాలని, జాబ్‌చార్టు అందజేయాలని కోరారు. ఎస్ఆర్ఎస్ నుంచి సీహెచ్‌ఓలకు మినహాయింపు ఇవ్వాలన్నారు. హెచ్ఆర్ పాలసీ, ఇంక్రిమెంట్లు, ట్రాన్స్ఫర్స్, ఎక్స్‌గ్రేషియా, ప్రభుత్వ సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం కొనసాగిస్తామన్నారు. శిబిరంలో ప్రజానాట్య మండలి కళాకారులు టి.పెద్దిరాజు, కొమ్ములు నాగేశ్వరరావు ఉద్యమ గేయాలు ఆలపించారు. శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమారి సిఐటియు నాయకులు పాల్గొన్నారు.



సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న ఆంజనేయులు నాయక్





బ్రహ్మనాయుడు అసత్య ఆరోపణలు మానుకోవాలి : వ్యాపార సంఘాలు

ప్రజాశక్తి - వినుకొండ : రాజకీయ స్వార్థం కోసం మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు వ్యాపారుల పట్ల అసత్య ఆరోపణలు సరికాదని వ్యాపార సంఘ నాయకులు ఖండించారు. శుక్రవారం ఆర్యవైశ్య సంఘం కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో వాణిజ్య విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి మోటమర్రి నరసింహారావు, డాల్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు చంద్రవోలు మల్లికార్జున, అపరాలు ధాన్యం బ్రోకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గట్టుపల్లి శ్రీనివాసరావు, కిరాణా మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు కోట బాలకృష్ణ, ఆర్యవైశ్య సదావర్తి సంఘం గౌరవ అధ్యక్షులు పెండ్యాల శ్రీనివాసరావు తదితరులు మాట్లాడారు. వ్యాపారులను ఇబ్బంది పెట్టే విధంగా బ్రహ్మనాయుడు మాట్లాడటం దుర్మార్గమన్నారు. మహానాడుకు వ్యాపార వర్గాల నుండి చందాలు వసూలు చేస్తున్నారని, మదమంచిపాడు వద్ద ఎడ్ల పందేలకు మక్కెన మల్లికార్జునరావు వ్యాపారుల నుండి చందాలు వసూలు చేశారని నిరాధార ఆరోపణలు సరికాదన్నారు. ఒకరికి చందాలు ఇచ్చే వారే కానీ చందా అడిగిన చరిత్ర జీవి ఆంజనేయులుకు లేదన్నారు. మల్లికార్జునరావు తన తండ్రి పేరుపై మదమంచిపాడు వద్ద జాతీయస్థాయి ఎడ్ల పందేలు ఏళ్ల తరబడి నిర్వహిస్తున్నా ఎప్పుడూ వ్యాపారులను చందా అడగలేదని చెప్పారు. వ్యాపార వర్గాలపై నిరాధార ఆరోపణలు చేస్తే సహించబోమన్నారు.



ఆర్టీసీ సర్వీసు సౌకర్యంపై పరిశీలన

ప్రజాశక్తి - వినుకొండ : మండలంలోని భారతపురం గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని కల్పించాలని కోరుతూ రైతుసంఘం మండల కార్యదర్శి రాజరాపు మునివెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గత సోమవారం తహశీల్దార్‌కు గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చిన మేరకు ఆర్టీసీ అధికారులు శుక్రవారం రూట్ పరిశీలించారు. వినుకొండ నుండి కుమ్మరిపాలెం, తిమ్మాయపాలెం, శ్రీరాంనగర్, భారతపురం, నడిగడ్డ నుండి కొప్పుకొండ వరకు గతంలో బస్సు నడుస్తూ ఉండేదని ఆర్టీసీ అధికారులకు గ్రామస్తులు చెప్పారు. రోడ్డు పదేళ్లుగా శిథిలావస్థ చేరడంతో బస్సులు రూట్ మళ్లించి చీకటిగలపాలెం, శివాపురం మీదుగా నడుపుతున్నారని, దీనివల్ల విద్యార్థులు, రోజువారి కూలీలు, పాల విక్రేతలు ఇబ్బందులు గురవుతున్నారని వివరించారు. ఇటీవల రైతుసంఘం ఆందోళన నేపథ్యంలో కూటమి ప్రభుత్వం రోడ్డు వేయించిందని, గ్రామాలకు బసౌకర్యం కల్పించాలని కోరారు. దారి బాగానే ఉందని, ఉన్నాతధికా రులతో మాట్లాడి బస్సును నడుపుతామని డిఎం చెప్పారు.

ఎంఆర్‌సికి 27,900 పాఠ్య పుస్తకాలు

ప్రజాశక్తి - మాచర్ల : ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు పంపిణీ చేసేందుకు 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 27,900 పాఠ్యపుస్తకాలు మండల విద్యావనరుల కేంద్రానికి చేరినట్లు ఎంఇఒ-2 అల్లి సురేష్ శుక్రవారం తెలిపారు. పట్టణ, మండల పరిధిలో 62 ప్రభుత్వ పాఠశాలలు, 8 ఎయిడెడ్ పాఠశాలలు ఉన్నాయని, 9 వేల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నట్లు చెప్పారు. 41 వేల పుస్తకాలు రావాల్సి వుండగా 27,900 పాఠ్యపుస్తకాలు అందాయని, ఇంకా నోట్ పుస్తకాలు, బ్యాగులు, బెల్టులు, బూట్లు, యూనీఫాం అందాల్సి ఉందని తెలిపారు. మిగిలినవి కూడా వచ్చిన తరువాత అన్ని కలిసి ఒక కిట్‌గా అందిస్తామన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలు విద్యను అందిస్తూన్నామని, పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ విద్యార్థులు సాధించిన మార్కులే దీనికి నిదర్శనమని చెప్పారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు.

27న బహిరంగ సభను జయప్రదం చేయండి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి - మంగళగిరి

మతసామరస్యం, దేశ సమగ్రత పరిరక్షణకై ఈనెల 27వ తేదీ మంగళవారం సాయంత్రం వామపక్షాలు, దళిత సంఘాలు, క్రైస్తవ సంఘాలు, ముస్లిం సంఘాలు, వివిధ సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్లో జరిగే బహిరంగ సభను, మంగళగిరిలో జరిగే ర్యాలీని జయప్రదం చేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ఈ సభను జయప్రదం చేయడానికి శుక్రవారం మంగళగిరి సిపిఎం కార్యాలయంలో సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సిపిఎం పట్టణ కార్యదర్శి వి.వి. జవహర్‌లాల్ అధ్యక్ష వహించారు. సిపిఎం గుంటూరు జిల్లా నాయకులు ఎస్.ఎస్.చంగయ్య మాట్లాడుతూ పహల్గాంలో గత నెల 22వ తేదీన 26 మంది పర్యాటకులను ఉగ్రవాదులు బలిగొన్నరని అన్నారు. ఈ ఘటనలో మృతి చెందిన వారిలో ముస్లింలు, హిందువులు ఉన్నారన్నారు. అయితే కొన్ని శక్తులు ఉగ్రవాదానికి, మతంతో ముడిపెట్టి ప్రజల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తున్నాయని విమర్శించారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండి ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. సిపిఐ పట్టణ కార్యదర్శి ఎ.ప్రభాకర్ మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడిని అన్ని రాజకీయ పార్టీలు ఖండించడం జరిగిందని అన్నారు. బిజెపి ఆర్‌ఎస్ఎస్ వారు సోషల్ మీడియాలో ముస్లింలకు వ్యతిరేకంగా విద్వేషపూరితమైన ప్రచారం చేయడం ప్రజల మధ్య చిచ్చు పెట్టడానికేనని అన్నారు. సిపిఐ ఎంఎల్ నాయకులు కె.కోటేశ్వరరావు మాట్లాడుతూ ఉగ్రవాది వ్యతిరేక పోరాటాన్ని రెండు మతాల మధ్య, దేశాల మధ్య యుద్ధం గా మార్చడానికి కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం చూస్తుందని విమర్శించారు. ఎండి యూసుఫ్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మత ద్వేషాలను రెచ్చగొట్టడానికి చూస్తుందని అన్నారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ పరిరక్షణ కమిటీ రాష్ట్ర కార్యదర్శి కె.రామారావు మాట్లాడుతూ 27న జరిగే బహిరంగ సభకు నియోజవర్గ పరిధిలో ఉన్న అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. క్రైస్తవ సంఘం నాయకులు కె.లార్డ్ వెస్లీ మాట్లాడారు. సమావేశంలో సిపిఎం సీనియర్ నాయకులు జె.వి.రాఘవులు, పి.బాలకృష్ణ, సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాలాజీ, సిపిఐ నాయకులు బి.వెంకటేశ్వరరావు, చిన్ని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టు వీర్లంకయ్య ఆశయాలు కొనసాగించాలి

సంస్మరణ సభలో సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ



సభలో మాట్లాడుతున్న వై నేతాజీ

ప్రజాశక్తి - తుళ్లూరు

తుళ్లూరు ప్రాంతంలో కమ్యూనిస్టు నాయకులు, అమరులు జొన్నకూటి వీర్లంకయ్య, తాడిపినేని రాఘవయ్య, చవల అంకయ్యలు పుచ్చలపల్లి సుందరయ్య చూపిన బాటలో పయనిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిస్వార్థంగా పని చేసి ప్రజల మన్ననలు పొందారని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై నేతాజీ అన్నారు. గురువారం రాత్రి తుళ్లూరులో కమ్యూనిస్టు నాయకులు జొన్నకూటి వీర్లంకయ్య సంస్మరణ సభలో ఆయన ప్రసంగించారు. ముందుగా అమర జీవులు జొన్నకూటి వీర్లంకయ్య, తాడి పినేని రాఘవయ్య, చవల అంకయ్య ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు జొన్నా కూటి నవీవన్ ప్రకాష్ అధ్యక్షతన సభలో నేతాజీ మాట్లాడుతు జొన్నకూటి వీర్లంకయ్య రైల్వే ఉద్యోగిగా పనిచేస్తూ, రైతుగా వ్యవసాయం చేస్తూ నిరాడంబరంగా జీవనాన్ని కొనసాగించారని అన్నారు. తుళ్లూరు ప్రాంతంలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు పరిష్కారమయ్యే వరకు కృషిచేసి కమ్యూనిస్టు వీర్లంకయ్యగా గుర్తింపు పొందారని అన్నారు. తాడిపినేని రాఘవయ్య తుళ్లూరు గ్రామ ఉపసర్పంచ్‌గా పని చేశారని, మంగళగిరి డివిజన్లో సిపిఎం నాయకుడిగా, రైతు నేతగా పనిచేసి ప్రజా నాయకుడిగా గుర్తింపు పొందారని అన్నారు. చవల అంకయ్య టైలర్‌గా వృత్తి చేసుకుంటూనే సిపిఎం అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. అమరుల ఆశయాలను ముందుకు తీసుకు వెళ్ళేందుకు సిపిఎం శ్రేణులు పట్టుదలగా కృషి చేయాలని కోరారు. దేశంలో ఉగ్రవాదులు, మతోన్మాదులు పెచ్చరిల్లుతున్నారని, కలిసిమెలిసి జీవిస్తున్న ప్రజల మధ్య చీలికలు తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని నేతాజీ ఆందోళన వ్యక్తం చేశారు. ఉగ్రవాదులు, మతోన్మాదులకు వ్యతిరేకంగా సిపిఎం పోరాడుతుందని అన్నారు. సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి మాట్లాడుతూ తుళ్లూరు ప్రాంతంలో జొన్నకూటి వీర్లంకయ్య తాడిపినేని రాఘవయ్య చవల అంకయ్యలు ప్రజా సమస్యలపై నిస్వార్థంగా పనిచేయడం వలన ప్రజల మనసులలో చిరస్మరణీయులుగా నిలిచిపోయారని అన్నారు. రాజధాని అభివృద్ధి పనులలో స్థానికులకు ఉపాధి కల్పించాలని, వలస కూలీలకు మౌలిక వసతులు అన్నీ కల్పించాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం రాజధాని డివిజన్ నాయకులు పేరం బాబురావు, ఇరిగి రాములు, సిహెచ్ నరసమ్మ, కృష్ణారావు జొన్నకూటి వీర్లంకయ్య సతీమణి మీనాక్షి, చవల అంకయ్య కుమారుడు లెక్చరర్ చవల రాంబాబు పాల్గొన్నారు.

ప్రజల మనిషి వల్లభనేని సాంబశివరావు

▸ కమ్యూనిస్టుగా ఆయన జీవితం స్ఫూర్తిదాయకం - ▸ వర్ధంతి సభలో వక్తలు



సభలో మాట్లాడుతున్న ఈమని అప్పారావు

ప్రజాశక్తి - దుగ్గిరాల

ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పరితపించడంతోపాటు నిలువ నీడలేని వేలమంది ప్రజలకు ఇళ్లస్థలాలు ఇప్పించిన సిపిఎం నాయకులు వల్లభనేని సాంబశివరావు జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు పేర్కొన్నారు. సిపిఎం తెనాలి డివిజన్, దుగ్గిరాల మండల పూర్వ కార్యదర్శి వల్లభనేని సాంబశివరావు ద్వితీయ వర్ధంతి గురువారం రాత్రి దుగ్గిరాల మండలం తుమ్మపూడిలో జరిగింది. తొలుత సాంబశివరావు అమరస్థూపం వద్ద నివాళులర్పించి పార్టీ పతాకాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు ఆవిష్కరించారు. చిత్రపటానికి పసుపు రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్నా శివశంకరరావు, బాపట్ల జిల్లా నాయకులు అగస్టీన్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి జెట్టి బాలరాజు అధ్యక్షతన జరిగిన సభలో ఈమని అప్పారావు మాట్లాడూతూ సమస్యలపై అధ్యయనం చేయడంలోనూ, వాటి పరిష్కారానికి కృషి చేయడంలోనూ వల్లభనేని సాంబశివరావు తపించేవారన్నారు. దుగ్గిరాల మండలంలో పలు గ్రామాల్లో పేదలకు ఇళ్లస్థలాలు దక్కాయంటే దానివెనకు సాంబశివరావు కృషి ఉందన్నారు. ఏ చిన్న సమస్య వచ్చినా పూర్తిగా అధ్యయనం చేయడంలో ప్రత్యేకత ఉండేదన్నారు. సమస్యను అధికారులకు వివరించే సమయంలోనూ సమగ్ర సమాచారంతో ఉండేవారన్నారు. ప్రస్తుత పాలకులు మతోన్మాద రాజకీయాలతో ప్రజల మధ్య చీలికలు తీసుకువస్తున్నారని, ఇటువంటి సమయంలో సాంబశివరావు స్ఫూర్తితో మతోన్మాదానికి వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ సమాజ సంక్షేమం కోసం పనిచేయాలని అన్నారు. పసుపు రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జన్నా శివశంకరరావు మాట్లాడుతూ రైతాంగ సమస్యలపై వల్లభనేని సాంబశివ రావు అధ్యయనం చేయడంలోనూ మేటి అన్నారు. ముఖ్యంగా దుగ్గిరాల, తెనాలి ప్రాంతంలో పసుపు రైతుల సమస్యలపై ఆయన నిరంతరం పోరాడేవారన్నారు. కౌలు రైతుల సమస్యలపైనా, పేదలు, దళితులు అన్నివర్గాల సమస్యలపైనా ఆయన నిరంతరం పోరాడారని తెలిపారు. సిపిఎం బాపట్ల జిల్లా నాయకులు బనిగల అగస్టీన్ మాట్లాడుతూ యువతను ప్రోత్సహించడంలోనూ, కమ్యూనిస్టు నిబద్ధతను ఆచరించడంలోనూ ఆయనకు ఆయనే చాటి అని తెలిపారు. కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.నటరాజు మాట్లాడుతూ ఎంతోమంది నాయకత్వాన్ని పార్టీలోకి తీసుకొచ్చిన సాంబశివరావు జీవితం ఆదర్శనీయం, అచరణీయమని అన్నారు. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే జీవితంగా సాంబశివరావు పనిచేశారని, ఎంతోమందికి స్ఫూర్తిదాయమని తెలిపారు. న్యాయవాది యేమినేని స్టాలిన్ మాట్లాడుతూ యువతను ప్రోత్సహించి పార్టీవైపు తీసుకురావడంలోనూ, ప్రజా సమస్యలను గుర్తించడంలోనూ సాంబశివరావు పాత్ర అనిర్వచనీయమని అన్నారు. సాంబశివరావు కుమారుడు సురేష్ మాట్లాడుతూ కమ్యూనిస్టుగా అత్యంత విలువైన జీవితాన్ని గడిపిన ఆయన స్ఫూర్తిని కొనసాగిస్తామని అన్నారు. పార్టీ గుడివాడ డివిజన్ నాయకులు బి.వి.శ్రీనివాసరావు అరుణ, స్థానికులు కె.శ్రీనివాసరావు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి చిరంజీవి, డివైఎఫ్ఐ మండల నాయకులు బుస్సా చిరంజీవి, యుటిఎఫ్ నాయకులు వి.వి.వి.సతీష్‌బాబు, రైతు సంఘం మండల కార్యదర్శి బ్రహ్మేశ్వరరావు, చొక్కాకుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వాడుకలోకి సీసీ కెమెరాలు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - ప్రత్తిపాడు



గురువారం ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన 'వేలాడుతున్న నిఘా నేత్రం' వార్తకు వట్టిచెరుకూరు సిఐ బాలు నాయక్ స్పందించారు. వెంటనే ఐదో మైలు వద్ద వేలాడుతూ ఉన్న సిసి కెమెరాను స్పెషల్ టీమ్ ద్వారా సరి చేసి మరలా వాడుకలోకి తీసుకువచ్చారు.



దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

171వ రోజుకు చేరిన దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి

తమకు న్యాయంగా రావలసిన బకాయిల కోసం ఏ సి సి సిమెంటు ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న రిలే దీక్షలు శుక్రవారం నాటికి 171వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను సిపిఎం నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు, యూనియన్ నాయకులు కే స్టీవెన్, బి సూర్యప్రకాష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు వేముల దుర్గారావు మాట్లాడుతూ ఎసిసి కార్మికులు చేస్తున్న పోరాటం చాలా న్యాయమైనదని రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. దీక్షలో కె.అగ్గయ్య , ఇస్మాయిల్, డి.మాణిక్యాలరావు, సిహెచ్.పిచ్చయ్య, రామారావు, కూర్చున్నారు. కార్యక్రమంలో ఎం.ఆశీర్వాదం, ఎం.గురవయ్య, ఎమ్మెల, నరసింహారావు, రమాదేవి, దుర్గాభవాని, వేముల లక్ష్మీ, ఎం.శారద, హిమాంబి, టి.దుర్గాభవాని, తుపాకుల నాగేశ్వరరావు, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నేతలు

పున్నమ్మ చెరువు పునరుద్ధరించేవరకు పోరాటం

ప్రజాశక్తి - తాడికొండ

తాడికొండ అడ్డరోడ్డు సెంటర్లోని ఎనిమిది ఎకరాల విస్తీర్ణం లో ఉన్న పున్నమి చెరువులో అక్రమంగా నిర్మాణాలు చేపట్టడం జరిగిందని, నిర్మాణాలను హైడ్రా తరహాలో కూల్చివేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ కోరారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డిఎల్ పిఓ కె.శ్రీనివాసరావు శుక్రవారం తాడికొండ పంచాయతీలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జంగాల మాట్లాడుతూ అడ్డరోడ్ సెంటర్లోని పున్నమ్మ చెరువును కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, అధికారులతో కుమ్మక్కై చేజిక్కించుకున్నారని అన్నారు. ఏప్రిల్ 14న ముఖ్యమంత్రి చంద్రబాబుకు పొన్నెకల్లు పర్యటనలో నాయకులు ఫిర్యాదు చేశారని గుర్తుచేశారు. ఆరు సంవత్సరాలుగా పున్నమ్మ చెరువు విషయమై సిపిఐ అలుపెరుగని పోరాటాలు కొనసాగించిందన్నారు. అక్రమంగా భూమిని కాజేసి నిర్మాణాలు చేపట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తక్షణమే నిర్మాణాలు కూల్చివే యాలని మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటపల్లి మధుసూదన్ రావు అధికారులను డిమాండ్ చేశారు. 75 సంవత్సరాలుగా తాము చెరువుకు కాపలా ఉంటున్నామని ఎర్రం శెట్టి రవి, శ్రీకృష్ణ యాదవ్ తమను బెదిరిస్తున్నారని, ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోవాలని బెదిరిస్తున్నారని చెరువు కాపలా దారులు సుజాత, శ్రీ లక్ష్మి అనే మహిళలు వాపోయారు. పున్నమ్మ చెరువును పునరుద్దం చేవరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని జంగాల చెప్పారు.

65వ రోజుకు పారిశుధ్య కార్మికుల నిరవధిక సమ్మె



నిరవధిక దీక్షలో పాల్గొన్న పారిశుధ్య కార్మికులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

తమ సమస్యలు పరిష్కరించే వరకు ఎట్టి పరిస్థితుల్లో పోరాటం ఆపేది లేదని అధికారులు, ప్రజాప్రతినిధులు దిగి వచ్చే వరకు వివిధ రూపాలలో తమ నిరసన శాంతియుతం గానే వ్యక్తం చేస్తామని మున్సిపల్ పారిశుధ్య కార్మికులు హెచ్చరిస్తున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు నరసరావుపేట పురపాలక సంఘం కార్యాలయం ఎదుట చేపట్టిన చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం 65 వ రోజుకు చేరుకుంది. 65 రోజుల నుండి నిరసన వ్యక్తం చేస్తున్నా అధికారులు ప్రజా ప్రతినిధులు, స్పందించక పోవడం పట్ల కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ పల్నాడు జిల్లా గౌరవ అధ్యక్షులు షేక్ సిలార్ మసూద్ మాట్లాడుతూ ఆప్కాస్ లో ఉన్న మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేసి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆప్కాస్‌లో ఉన్న మిగతా కార్మికులకు రూ.21 వేలు వేతనం ఇస్తున్నప్పటికీ, అదే విధానంలో ఆరేళ్లుగా పని చేస్తున్న 40మంది కార్మికులకు నెలలో 30 రోజులు పని చేసినా సగం రోజులకే వేతనాలు ఇస్తున్నారని అనేక మార్లు అధికారులకు మొర పెట్టుకున్నప్పటికీ ప్రయోజనం లేదని పైగా ఇష్టముంటే వీధుల్లోకి రండి లేకపోతే తప్పుకోవాలంటూ హెచ్చరించడంతో గత్యంతరం లేక శాంతియుత పోరాటం చేస్తున్నామన్నారు. నెల రోజులు పని చేస్తే 10 నుంచి 15 రోజులకు వేతనం ఇస్తే కార్మికుల కుటుంబాలు ఎలా గడవాలని ప్రశ్నించారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే దష్టికి మున్సిపల్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఏమాత్రం ఫలితం లేదన్నారు. కార్మికుల ఓట్లతో గద్దెనెక్కిన ప్రభుత్వాలు కార్మికుల శ్రమను దోపిడీ చేస్తూ కార్మికుల జీవితాలను రోడ్డును పడేస్తున్నాయన్నారు. పారిశుధ్య కార్మికులు నిరవధిక సమ్మెకు పూనుకున్న నేపథ్యంలో రోజుకు రూ.700 వేతనం ఇచ్చి ప్రయివేటు వ్యక్తుల చేత పారిశుధ్య పనులు చేయిస్తున్నారని అవే వేతనాలు తమకు ఇస్తే తామే పని చేస్తామన్నారు. ఆరేళ్లు విధులు నిర్వహించిన తమను ఇబ్బందులకు గురి చేయడం వివక్ష చూపడం ఎందుకన్నారు. కార్మిక చట్టాలు అమలులో ఉన్నప్పటికీ కార్మికుల పరిస్థితి అయోమయంగా తయారైందని అదే 4 లేబర్ కోడ్ లు అమలు జరిగితే కార్మికుల పరిస్థితి మరింత దయనీయంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

27న రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో నిరసన దీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘ నాయకులు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఐటీసీ, జీపిఐ, అలయన్స్, ఎంఎల్, పోలిశెట్టి తదితర పొగాకు కంపెనీలు నల్లబర్లి పొగాకు క్వింటాలు రూ.15 వేలకు వెంటనే కొనుగోలు చేయాలని రైతు సంఘ నాయకులు అన్నారు. శుక్రవారం రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో స్థానిక ఎన్నార్టీ సెంటర్‌లోని సిపిఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈనెల 27న ఉదయం 10 గంటలకు పట్టణంలోని ఎన్నార్టీ సెంటర్ వద్ద ఉన్న ఐటీసీ కంపెనీ ఎదురుగా పెద్ద ఎత్తున నిరసన దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ మంత్రి సమక్షంలో కంపెనీలు అంగీకరించిన విధంగా బల్లి పొగాకును వెంటనే కొనుగోలు చేయాలన్నారు. గత సంవత్సరం కొన్న క్వింటా రూ. 15 వేలకు తక్కువ కాకుండా ప్రభుత్వం వారు కంపెనీల చేత కొనిపించేలా చర్యలు తీసుకోవాలన్నారు. 27న చేపట్టే నిరసన దీక్షలో ఉమ్మడి గుంటూరు, ఉమ్మడి ప్రకాశం, ఉమ్మడి కర్నూలు జిల్లాలోని బర్లి రైతులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సంఘాల నాయకులు, రైతు నాయకులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు డాక్టర్ కొల్లా రాజ మోహనరావు, తాళ్లూరి బాబురావు, పేరుబోయిన వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మున్సిపల్ నిధుల స్వాహాలో విడదల రజనీ పాత్రపై సమగ్ర విచారణ జరిపించండి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఇటీవల చిలకలూరిపేట మున్సిపాలిటీలో వెలుగు చూసిన నిధుల స్వా హాలో మాజీమంత్రి రజనీ, అమె మరిది గోపిలే అసలు దోషులని, వారి పాత్ర, ప్రమేయం తేలాంటే నిదులు కాజేసి పరారైన ఇక్కుర్తి గంగాభవానీ, ఆమె భర్త పవన్‌ను విచారించాలని స్థానికుడు షేక్ మాబుసుభాని, స్థానికులు మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావుని కోరారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారంమాజీమంత్రి ప్రత్తిపాటి ప్రజావేదిక నిర్వహించారు. వివిధ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలు స్వీకరించిన ఆయన, వాటి పరిష్కారంపై వెంటనే అధికారులతో మాట్లాడారు. వైసీపీ హయాంలో నియోజకవర్గంలో విచ్చలవిడి అవినీతికి పాల్పడిన విడదల రజనీ, ఆమె మరిది గోపి, అనుచరులపై వచ్చిన ఫిర్యాదుల్ని క్షుణ్ణంగా పరిశీలించిన ప్రత్తిపాటి, సమగ్ర విచారణ జరిపించి అవినీతిపరులకు శిక్ష పడేలా చూస్తానని ఫిర్యాదుదారులకు భరోసా ఇచ్చారు. మున్సిపాలిటీ నిధుల స్వాహాలో అసలు దొంగలు విడదల రజనీ ఆమె మరిది గోపీనే కూటమిప్రభుత్వం ఏర్పడ్డాక చిలకలూరిపేటలో వెలుగు చూసిన రూ.35లక్షల నిధుల గోల్‌మాల్ వ్యవహారంలో అసలు దోషులు రజనీ, ఆమె మరిది గోపీలేనని పట్టణవాసులు షేక్ మాబుసుభాని ఎమ్మెల్యే ప్రత్తిపాటికి ఫిర్యాదుచేశారు. నిధుల స్వాహాకు పాల్పడి పరారైన ఇక్కుర్తి గంగా భవానీ, ఆమె భర్త పవన్ రజనీకి కీలక అనుచరులని, వారిని పట్టుకొని విచారిస్తే మాజీమంత్రి కుటుంబం పాత్ర బయటకు వస్తాయని ఫిర్యాదుదారు సుభాని ఫిర్యాదులో తెలియ చేశారు. తన రైస్ మిల్లుపై రేకులు వేసుకుంటుంటే, అప్పటి మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి సునీత పనులు ఆపి, అప్పటి మంత్రి విడదల రజనీని కలిసి మాట్లాడుకోవాలని తనను బెదిరించారని ఇంటూరి సుబ్బారావు శుక్రవారం వివిధ సమస్యల పరిష్కారం కార్యక్రమంలో ప్రత్తిపాటికి చెప్పారు. తాము కొత్తగా ఎలాంటి నిర్మాణాలు చేపట్టలేదని, పాడై పోయిన పాతరేకుల స్థానంలో కొత్తవి వేసుకుంటున్నామని, దానికి రజనీని ఎందుకు కలవాలని అప్పట్లో ప్రశ్నిస్తే తనను భయపెట్టారన్నారు. నెల రోజులు పనులు ఆపడంతో చివరకు చేసేదేంలేక రజనీ మరిది విడదల గోపిని కలిస్తే, తమకు రూ.15లక్షలు ఇచ్చి రేకులు వేసుకోవాలని చెప్పాడని ఫిర్యాదుదారు సుబ్బారావు తెలియ చేశారు. అంత డబ్బు ఇవ్వలేనని కాళ్లావేళ్లా పడి బతిమాలితే చివరకు రూ.8లక్షలు ఇవ్వాలని, లేకుంటే రైస్ మిల్ కూడా నడవ నివ్వమని గోపి బెదిరించడంతో ఆ మొత్తం సొమ్ము ఇచ్చి పని పూర్తి చేసుకున్నానని ప్రత్తిపాటికి దగ్గర వాపోయారు. ఈ విష యంపై నిజానిజాలు తెలుసుకొని సుబ్బారావు, హరిబాబు ఇబ్బంది పెట్టిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని పోలీస్ వారిని ఆదేశించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నెల్లూరి సదాశివరావు, షేక్‌టీడీపీ కరీముల్లా, జవ్వాజి మధన్‌మోహన్, పఠాన్ సమాధ్‌ఖాన్, మద్దుమలా రవి, కందుల రమణ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ప్రత్తిపాటికి అర్జీ ఇస్తున్న షేక్ మాబుసుభాని



బాధితులకు చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - పెదకూరపాడు

అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందిన పెదకూరపాడు నియోజకవర్గ పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ శుక్రవారం పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్య మంత్రి సహాయనిధి ద్వారా సహాయం అందించి చంద్రబాబు పేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నారన్నారు. కార్య క్రమంలో పెదకూర పాడు మండల టిడిపి అధ్యక్షులు అర్తిమళ్ళ రమేష్, మాజీ ఎంపీపీ బాబురావు, నాయకులు షేక్ ముంతాజ్, మస్తాన్ షరీఫ్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే చదలవాడను సన్మానించిన గట్టుపల్లి సత్యనారాయణ

కష్టపడిన ప్రతీ కార్యకర్తకు గుర్తింపు

ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

టిడిపి విస్తరణకు, బలోపేతానికి కృషి చేసి కష్టపడిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని ఉన్నత పదవులు ఇచ్చి గౌరవించుకోవడం జరుగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. టిడిపి నరసరావుపేట పట్టణ నూతన అధ్యక్షునిగా ఎన్నికైన గట్టుపల్లి సత్యనారాయణ శుక్రవారం టిడిపి నియోజకవర్గ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబును మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ మాట్లాడుతూ పార్టీ పట్టణ అధ్యక్షునిగా ఆర్యవైశ్యులకు దక్కటం ఆనందంగా ఉందన్నారు. గట్టుపల్లి మొదటి నుండి టిడిపి కార్యకర్తగా పనిచేశారని కౌన్సిలర్‌గా గెలుపొంది విశేష సేవలు అందించారన్నారు. గట్టుపల్లికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయ గుప్తా, మాజీ వైస్ చైర్మన్ షేక్. మీరావలి, పట్టణ మాజీ కౌన్సిలర్లు, ఆర్యవైశ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.



దేవల ప్రసాద్‌కు నియామక పత్రాన్ని ఇస్తున్న బేబిరాణి

ఏపీ వడియా రాజుల సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షులుగా దేవల ప్రసాద్

ప్రజాశక్తి - వినుకొండ

ఆంధ్రప్రదేశ్ వడియా రాజుల సంక్షేమ సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షునిగా దేవల ప్రసాద్‌ను నియమించారు. వినుకొండ పర్యటనలో భాగంగా శుక్రవారం ప్రసాద్ స్వగ్రామానికి వెళ్లిన రాష్ట్ర అధ్యక్షురాలు వేముల బేబీ రాణి (సుప్రీం కోర్టు లాయర్) దేవల ప్రసాద్‌కు నియమకా పత్రాన్ని అందించారు. ఆమె వెంట రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవల యాలాద్రి, సంఘ నేతలు పల్లపు. పున్నయ్య, బత్తుల శివ శ్రీను, చల్ల. శివ, తమ్మిశెట్టి, బాలవెంకటస్వామి, బత్తుల నరసింహ ఉన్నారు. పలువురు దేవల ప్రసాద్‌ను అభినందించారు.


తెలుగు దేశం పార్టీ లో పదవుల నియామకాలు

ప్రజాశక్తి -నరసరావుపేట టౌన్

నరసరావుపేట మండలం, నరసరావుపేట పట్టణ తెలుగుదేశంపార్టీలో కమిటీల నియామకాలు చేపట్టినట్లు పార్టీ కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. శుక్రవారం జరిగిన నియామకాలలో నరసరావుపేట మండల అధ్యక్షులుగా బండారుపల్లి విశ్వేశ్వరరావు నరసరావుపేట మండలం ప్రధాన కార్యదర్శిగా షేక్ మహబూబ్ సుభాని నరసరావుపేట మండలం ఉపాధ్యక్షులుగా శిఖినం అమర్నాథ్‌ను నియమించారు. నరసరావుపేట పట్టణ అధ్యక్షులుగా గట్టుపల్లి సత్యనారాయణ, ప్రధాన పట్టణ కార్యదర్శిగా గూడూరి శేఖర్, పట్టణ ఉపాధ్యక్షులుగా కుంచాల బాజీను నియమించినట్లు తెలిపింది.

ఎంపీపీ తండ్రి శాఖమూరి బుచ్చయ్య గుండెపోటుతో మృతి

ప్రజాశక్తి-ఈపూరు



శాఖమూరి బుచ్చయ్య (ఫైల్)

మండలంలోని పెద కొండాయపాలెం గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నేత శాఖమూరి బుచ్చయ్య (69) గుండెపోటుతో శుక్రవారం మృతి చెందినట్లు బంధు వులు తెలిపారు. ఛాతిలో నొప్పి రావడంతో శుక్రవారం ఉదయం నరసరావుపేటలో ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకు వెళ్ళగా చికిత్స పొందుతూ ఆసుపత్రిలో తుదిశ్వాస విడి చారు. శాఖమూరి బుచ్చయ్య వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్‌గా రెండు దఫాలుగా పనిచేసి పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిం చేవారు. ప్రస్తుతం ఈపూరు ఎంపీపీగా బుచ్చయ్య కూతురు ఈదర రాధిక పదవిలో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ హయంలో బుచ్చయ్య భార్య శివమ్మ ఎంపీటీసీగా పని చేశారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ, పోలీసులు

ముమ్మరంగా వాహనాల తనిఖీ

ప్రజాశక్తి - క్రోసూరు

పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. క్రోసూరులోని సినిమా హాల్ సెంటర్లో ఎస్ఐ రవిబాబు ఆధ్వర్యంలో పోలీసులు వచ్చే పోయే వాహనాలను తనిఖీ చేశారు. నిబంధనలకు లోబడి వాహనదారులు రాకపోకలు సాగించాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, పెద్ద వాహనాలు నడిపే వారు సీల్డు బెల్టు ధరించాలని ఎస్ఐ సూచించారు. వాహనదారులు ధృవీకరణ పత్రాలతోనే ప్రయాణం చేయాలని తెలిపారు. లైసెన్సు లేకుండా వాహ నాలు నడపడం వలన ట్రాఫిక్ నిబంధనలు తెలియక పోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం వుందన్నారు. పోలీసులు తనిఖీలలో వాహనాలకు సంబంధించిన ధృవీకరణ పత్రాలతోపాటు డ్రైవింగ్ లైసెన్సును చూపించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు.

వ్యవసాయ రంగాన్ని కాపాడాలి : సిపిఐ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

డాక్టర్ స్వామి నాథన్ కమిటీ సిపార్సులు ద్వారానే సంక్షోభంలో ఉన్న వ్యవసాయ రంగానికి పూర్వ వైభవం సాధ్యమని సిపిఐ ఏరియా కార్యదర్శి చక్రవరం సత్యనారాయణరాజు అన్నారు. రొంపిచర్ల మండలంలో వీరవట్నం గ్రామంలో శుక్రవారం సిపిఐ గ్రామ శాఖా సమావేశం జరిగింది. సత్యనారాయణరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు పడుతున్న నేపథ్యంలో రైతులు సాగుకు సిద్ధమౌతున్నారన్నారు. ప్రభుత్వం రైతులకు రైతుభరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు పంపిణీ చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద గ్రామాలలో కూలీలకు 200 రోజులు పని దినాలు కల్పించాలన్నారు. డాక్టర్ స్వామి నాథన్ కమీషన్ సిఫార్సుల మేరకు రైతులు పండించిన పంటలకు మద్దతు ధరల చట్టం చేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు హుస్సేన్, శ్యామల వీరారెడ్డి, గొట్టం పుల్లారెడ్డి, కోట్ల లింగారెడ్డి పాల్గొన్నారు.


ప్రత్తిపాడులో బ్యాగులను పరిశీలిస్తున్న ఏంఈఓ 2 లీలా రాణి, దుగ్గిరాల మండల విద్యాధికారి కార్యాలయానికి చేరిన బ్యాగులు , పుస్తకాలు

బడులు తెరిచే నాటికి పాఠ్యపుస్తకాలు పూర్తిగా వచ్చేనా?

ప్రజాశక్తి - ప్రత్తిపాడు:
ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేసే పాఠ్యపుస్తకాలు బడులు తెరిచే నాటికి విద్యార్థులకు అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మండలంలో బడులు ముగిసేనాటికి విద్యార్థుల సంఖ్య 2350 మంది ఉండగా వారికి సంబంధించి అరకొరగా టెక్స్ట్ బుక్స్, బ్యాగులు ప్రత్తిపాడు మండల విద్యా వనరుల కేంద్రానికి చేరాయి. అయితే ఇంకా మరికొన్ని టెక్స్ట్ బుక్స్, విద్యార్థులకు అవసరమైన యూనిఫాం, బూట్లు, బెల్ట్, నోట్ బుక్స్ తదితర విద్యార్థులకు పంపిణీ చేసే నాటికి అందుతాయా అనేది సందేహం. గతంలో బడులు తెరిచాక కూడా ఆరు నెలల వరకు పిల్లలకు అందిస్తూనే ఉన్నారు. ఈసారైనా బడులు తెరిచే నాటికి విద్యార్థులకు అందజేయాలని స్థానికులు కోరుతున్నారు. ప్రస్తుతం మండల విద్యా వనరుల కేంద్రానికి విద్యార్థులకు అవసరమైన టెక్స్ట్ బుక్స్ 12239 అవసరం అవగా 8755 మాత్రమే వచ్చాయి. ఇంకా 3484 టెక్స్ట్ బుక్స్ రావాల్సి ఉంది. ప్రస్తుత విద్యార్థుల సంఖ్య 2350 ఆధారంగా బ్యాగులు చేరాయి. మిగిలిన టెక్స్ట్ బుక్స్ మరియు నాట్ బుక్స్ గతంలో మాదిరి పంపిణీ జరుగుతుందా లేక రాష్ట్ర ప్రభుత్వం అనుకున్న రీతిగా పంపిణీ చేస్తారా వీటిని విద్యార్థులకు పర్యవేక్షణ కమిటీ అనగా మండల విద్యాధికారి ప్రధానోపాధ్యాయులు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ మహిళా పోలీస్ మరియు పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో బడులు తెరిచిన రోజు విద్యార్థులకు పంపిణీ చేస్తారు.

ప్రజాశక్తి - దుగ్గిరాల
రానున్న విద్యా సంవత్సరానికి గాను మండల విద్యాధికారి కార్యాలయానికి బ్యాగులు, పుస్తకాలు శనివారం చేరాయి. మంత్రి నారా లోకేష్ విద్యారంగంలో పలుమార్పులు చేపట్టారు. అందులో భాగంగా గతంలో ఉన్న సిలబస్ స్థాయిలో కొత్త సిలబస్ ప్రారంభించనున్నారు . మండల విద్యాధికారి కాజ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలో ఒకటి నుండి పదో తరగతి వరకు 3639 మంది (ప్రభుత్వ పాఠశాలలో) విద్యార్థిని విద్యార్థులు ఉన్నారు. ఇప్పటివరకు మండలానికి 37 12 బ్యాగులు వచ్చాయి. 30వేల టెస్ట్ పుస్తకాలు రావలసి ఉండగా 12434 పుస్తకాలు వచ్చాయి. ఇంకా టెస్ట్ పుస్తకాలు నోటు పుస్తకాలు బెల్టులు, బూట్లు, యూనిఫామ్ ఒకటో తరగతి వారికి డిక్షనరీలు రావాల్సి ఉన్నది. జూన్ 12వ తేదీన పాఠశాలలు ప్రారంభం అవుతాయి. అప్పటికి రావలసిన విద్య మెటీరియల్ అంతా వస్తుందని ఆయన తెలిపారు.


నారాకోడూరులో పర్యటించిన కేంద్ర బృందం

నారా కోడూరులో కేంద్ర బృందం పర్యటన

ప్రజాశక్తిచేబ్రోలు : గ్రామ స్థాయి అవసరాలు, సంబంధిత అన్ని అభివృద్ధి శాఖల ద్వారా డిజిటల్, స్మార్ట్ గ్రామ అభివృద్ధికి సాధ్యాలను పరిశీలించేందుకు శుక్రవారం మండలంలోని నారాకోడూరులో కేంద్ర బృందం పర్యటించింది. ఈ సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎ.ఉమాదేవి మాట్లాడుతూ డిజిటల్ / స్మార్ట్ విలేజ్ చొరవతో నారాకోడూరు గ్రామాన్ని క్షేత్రస్థాయిలో కేంద్ర బృందం సందర్శించి పరిశీలించారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం టెలి కమ్యూనికేషన్ డైరెక్టర్లు పీవీ ప్రవీణ్, కె.ఎస్. నేల్తా, ఆరాధ్య స్లామ్, డైరెక్టర్ పోస్టల్ సర్వీసెస్ అతిక్యు అహ్మద్ పాల్గొన్నారన్నారు. తొలుత సమావేశం నిర్వహించి ఆయా శాఖలకు సంబంధించిన విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నారాకోడూరు గ్రామంలోని గ్రామ సచివాలయాన్ని సందర్శించి పరిశీలించారు. అలానే వేజెండ్ల గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం సొసైటీ కార్యాలయాన్ని సందర్శించి పరిశీలించారు. కార్యక్రమంలో తెనాలి డిప్యూటీ డిఎంహెచ్ఓ అన్నపూర్ణ, డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ జి.శాంతకుమారి, ఏడి అగ్రికల్చర్ రామకోటేశ్వరి, కె.వి.రామారావు డిఎల్పిఓ, జిఎస్డబ్ల్యూ ఎస్.మోహన్‌రెడ్డి, ఎంపీడీవో ఉమాదేవి, తహశీల్దార్ కె. శ్రీనివాస శర్మ, ఈవోపిఆర్ అండ్ ఆర్‌డి టి.ఉషారాణి, ఏపిఎం శ్రీలక్ష్మి, ఇతర మండల గ్రామస్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఒకటి నుంచి షాపుల వద్దే రేషన్ పంపిణీ

ప్రజాశక్తి-తెనాలిరూరల్
రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ 1వ తేదీ నుంచి చౌకధరల దుకాణాల్లోనే లబ్ధిదారులకు రేషన్ పంపణి చేయనున్నట్లు తెనాలి తహశీల్దార్ కె.వి. గోపాలకృష్ణ తెలిపారు. రేషన్ డీలర్లు, ఎంవియు వాహనాల యజమానులతో శుక్రవారం ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. తహశీల్దార్ మాట్లాడుతూ గతంలో మాదిరిగా ఇకపై జూన్ 1 నుండి 15 వరకు ప్రజా పంపిణీ విధానం దుకాణాలు వద్దే రేషన్ సరఫరా విధానం అమలు చేస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులకు మౌలిక సదుపాయాలను దుకాణాల వద్ద కల్పించాలని చెప్పారు. ఆలస్యంగా వచ్చిన వినియోగదారులను వట్టిచేతులతో పంపించకుండా రేషన్ అందేలా సమయం కేటాయించాలని నిర్దేశించారని చెప్పారు. ప్రభుత్వం చేపట్టిన చర్యల కారణంగా బియ్యం అక్రమ రవాణా అరికట్టవచ్చని తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ గోపాలకృష్ణ

స్వచ్ఛంద సేవాసంస్థల భాగస్వామ్యంతోనే ఆరోగ్యం


ఉచిత వైద్యశాలను ప్రారంభిస్తున్న ముప్వా శివనాగేంద్రమ్మ, మాట్లాడుతున్న డాక్టర్ రఘురామిరెడ్డి

ప్రజాశక్తి - తుళ్లూరు
ఆరోగ్య భారత నిర్మాణంలో స్వచ్ఛంద సేవా సంస్థల భాగస్వామ్యంతోనే ఆరోగ్యం, సామాజికాభివృద్ధి సాధ్యమని ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ రఘురామిరెడ్డి అన్నారు. ముప్వా చినబాపిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పెదపరిమిలో శుక్రవారం ఉచిత వైద్యశాలను ముప్వా శివనాగేంద్రమ్మ ప్రారంభించారు. తొలుత చిన్న బాపిరెడ్డి చిన్న బాపిరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించిన అనంతరం డాక్టర్ విద్యాపతి వైద్య సేవలు ప్రారంభించారు. డాక్టర్ రఘురామిరెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో అతిపెద్ద అభివఅద్ధి చెందిన దేశంగా మారబోతున్న తరుణంలో మనదేశంలో ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం ముఖ్య అవసరాలుగా ఉన్నాయన్నారు. సభకు అధ్యక్షత వహించిన మేనేజింగ్ ట్రస్టీ ఎం.వి.రామిరెడ్డి మాట్లాడుతూ సోమవారం నుంచి శనివారం వరకు ప్రతిరోజూ సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకూ ఈ క్లినిక్‌లో డాక్టర్ అందుబాటులో ఉంటారని చెప్పారు. ఉపాధ్యాయ సంఘం నాయకులు బాడిశ హనుమంతరావు, లాయర్ వాణిశ్రీ మాట్లాడుతూ ట్రస్ట్ చేస్తున్న గ్రామీణ సేవల్ని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భాష్యం సాంబశివరావు, నంబూరు బాబూరావు, భాష్యం నరసింహారావు, ట్రస్టీలు వంగా సాంబిరెడ్డి, ముప్వా పూర్ణలలిత కుమారి, కట్టా కోటిరెడ్డి, ప్రజా ఆలోచన వేదిక అధ్యక్షులు మేడూరి రాజేంద్రప్రసాద్, కోఆర్డినేటర్ వల్లూరి సదాశివరావు, ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి మున్నంగి సాంబిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


బాలికలకు అవగాహన కల్పిస్తున్న సూపర్ వైజర్ మాధవి

నైపుణ్యాలపై కిశోర బాలికలకు అవగాహన

ప్రజాశక్తి - ప్రత్తిపాడు
కిశోర బాలికలకు ఉన్నత విద్యా, కెరీర్ మార్గ దర్శకల నైపుణ్యాలపై శుక్రవారం గొట్టిపాడు సెక్టార్ సూపర్ వైజర్ మాధవి అవగాహన కల్పించారు. గొట్టిపాడు అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఉన్నత విద్యలోని వివిధ రకాల కోర్సుల ఉద్యోగ అవకాశాలు గురించి, నైపుణ్యాలు లక్ష్యాలు నిర్దేశించుకోవడం వాటిని ఏ విధంగా సాధించుకోవాలి ఆర్థిక సమానత్వం మహిళ సాధికారత గురించి వివరించారు.

కొత్తూరులో రాఫా క్లినిక్ ప్రారంభం

ప్రజాశక్తి -తాడేపల్లి
తాడేపల్లి పట్టణంలోని కొత్తూరులో శుక్రవారం నూతనంగా రాఫా క్లినక్‌ను డాక్టర్ ఎస్.విజయ్ కుమార్ (ఎంబిబిఎస్, డిసి, డిఈఎం) రెవ.పాస్టర్ ఎం.దేవారాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాఫా క్లీనింగ్ ద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. ప్రజలకు మంచి సేవను అందించి మంచి పేరు తెచ్చుకోవాలని కోరారు. రాఫా క్లినిక్ డాక్టర్ విజయ్ కుమార్ మా 24 గంటలు అత్యవసర సేవలు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. ఈ కార్యక్రమం రవి కిషోర్, ఎం.అబ్రహం, యోహాన్, దానియేలు, ప్రేమ్ కుమార్, సురేష్, ప్రేమ్ కుమార్, జాన్ మోజెస్, రాఫా క్లినక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

మహాసభలను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - తెనాలి
వచ్చే నెల 5న విజయవాడలో నిర్వహించే ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను విజయ వంతం చేయాలని తెనాలి యూనిట్ ప్రధాన కార్యదర్శి కె.కమల కుమారి, ఆర్గనైజింగ్ సెక్రటరీ డి.సుధీర్ కోరారు. స్థానిక పాత ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో శుక్రవారం సమావేశాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు డి .శ్రీనివాసరావు, షేక్ అన్వర్, ఎ.బాల చంద్రమౌళి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కరోనా పట్ల అవగాహన కల్పించండి

ప్రజాశక్తి - దుగ్గిరాల
కరోనా కేసులు రాష్ట్రంలో నమోదు కావడంతో ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ అప్రమత్త మైనది. కరోనా పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని, తమకు సమాచారం అందినదని గ్రామ కార్యదర్శి వివేకానంద తెలిపారు. గ్రామంలో విస్తృతంగా దండోరా ద్వారా మైకుల ద్వారా ప్రజలకు తెలియజేస్తామన్నారు. సామూహిక సమావేశాలు ప్రార్థన సమావేశాలు ఫంక్షన్లు ఎక్కువ జనాభా ఉండే బస్టాండ్ రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో గుమి కూడి ఉండటం చేతులు కడగటం పరిశుభ్రత పాటించటం మాస్కులు ధరించడం తదితర జాగ్రత్తలన్నీ తిరిగి చేపట్టాలని కోరారు.

నేడు రైల్వే గేటు మూసివేత

ప్రజాశక్తి - దుగ్గిరాల
విజయవాడ గూడూరు రైల్వే మార్గంలో కొత్త లైను నిర్మాణ పనులు జరుగుతుండటంతో శనివారం ఉదయం ఏడు గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు దుగ్గిరాల రైల్వే గేటు మూసి వేస్తున్నట్లు స్టేషన్ మాస్టర్ టి .శ్రీనివాసరావు తెలిపారు. ఈ మార్గం కుండా ప్రయాణించే వారు ప్రత్యామ్నాయ మార్గం ద్వారా ప్రయాణించాలని ఆయన కోరారు.



మహేష్ యాదవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మంత్రి లోకేష్

ప్రజాశక్తి - తాడేపల్లి
ఉండవల్లిలో రాష్ట్ర మంత్రివర్యులు నారా లోకేష్ ను ఆయన నివాసంలో గురువారం స్థానిక టీడీపీ నాయకులు, ఉమా యాదవ్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు డాక్టర్ తాడిబోయిన మహేష్ యాదవ్ తన పుట్టినరోజు సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి స్వీట్ తినిపించారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ అభివృద్ధికి మహేష్ యాదవ్ కృషి చేస్తున్నారని కొనియాడారు. ఉమా యాదవ్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు కర్రేటి సురేష్ బాబు, గడవర్తి నాగేశ్వరరావు, సురేష్ బాబు, రాంబాబు, తాడిబోయిన గోపి కృష్ణ, బట్టు రామకఅష్ణ, తన్నీరు తరుణ మంత్రి లోకేష్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - తాడేపల్లి
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు జయంతి సందర్భంగా శనివారం తాడేపల్లి పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు తెలిపారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు కంటికి సంబంధించిన పరీక్షలు నిర్వహిరస్తారన్నారు.


మాణిక్యరావు విగ్రహానికి నివాళి అర్పించిన లక్ష్మణరావు, లక్ష్మణరెడ్డి, అధ్యాపకులు

అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి విశేష కృషి


ఎంజె మాణిక్యరావు విగ్రహం వద్ద నివాళులర్పించిన కెఎస్ లక్ష్మణరావు తదితరులు

ప్రజాశక్తి-గుంటూరు

అధ్యాపక , ఉపాధ్యాయ ఉద్యమ నేత ఎం.జె. మాణిక్యరావు శతజయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక ఆంధ్రా క్రిస్టియన్ కాలేజి వద్ద ఉన్న ఎం.జె. మాణిక్యరావు కాంస్య విగ్రహానికి మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వి.లక్ష్మణరెడ్డి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో మాణిక్యరావు కుమారుడు ఎం.విజయ్‌కుమార్, ఆక్టా అధ్యక్షులు కె.మోహనరావులతోపాటు పెద్ద సంఖ్యలో అధ్యాపకులు హాజరై నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ఎం.జె. మాణిక్యరావు ఎమ్మెల్సీగా, అధ్యాపకునిగా, అధ్యాపక ఉపాధ్యాయ ఉద్యమ నేతగా అవిరళ కృషి చేశారని, ముఖ్యంగా ఎయిడెట్ విద్యాసంస్థల పురోగతికి తోడ్పడ్డారని కొనియాడారు.

ఆర్‌విఆర్ జెసి విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి-గుంటూరు



గ్రాన్యూల్ ఇండియా సంస్థ ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజి నీరింగ్ కాలేజిలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 13 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని, ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటి వరకూ 822 మంది విద్యార్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారని కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె తెలిపారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థులను శుక్రవారం కళాశాల యాజమాన్యం అభినందించింది. కంప్యూటర్ కోర్సులతో పాటు, కోర్ ఇంజినీరింగ్ విద్యార్థులకు కూడా మంచి ప్యాకేజిలతో ఉద్యోగాలు లభిస్తున్నాయని కళాశాల సెక్రెటరీ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ అన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సి పాల్ డాక్టర్ కె.రవీంద్ర మాట్లాడుతూ కెమికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు 13 మందికి రూ.3 లక్షల ప్యాకేజితో ఉద్యోగాలు లభించాయన్నారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు, కెమికల్ ఇంజినీరింగ్ విభాగం ఇన్‌చార్జి విభాగాధిపతి డాక్టర్ కె.రమేష్‌చంద్ర, కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట ఆఫీసర్లు సిహెచ్.శ్రీనివాసరావు, డాక్టర్ కె.సురేష్‌బాబు అభినందించారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

మావోయిస్టుల మృతదేహాలను బంధువులకు అప్పగించాలి : పిడిఎం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



ఈ నెల 21న ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లాలో ఎన్ కౌంటర్‌లో మృతి చెందిన 27 మంది మావోయిస్టుల మృత దేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించాలని పిడిఎం నాయకులు నల్లపాటి రామారావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన నరసరావుపేటలో మాట్లాడారు. మృతదేహాలను సకాలంలో ఇచ్చి వారి ఆనవాయితీ ప్రకారం అంత్యక్రియలు నిర్వహించుకునేలా వెసులుబాటు కల్పించాలన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చం నాయుడు, శ్రీకాకుళం జిల్లా ఎస్.పి కేశవరావు మావోయిస్టుల కుటుంబ సభ్యులను బెదిరించడం, మృత దేహాలను బంధువులకు ఇవ్వకుండా అడ్డుకోవడం సమంజసం కాదన్నారు. శాంతి చర్చలకు సిద్ధమని కాల్పుల విరమణ ప్రకటించిన మావోయిస్టు అగ్ర నాయకుడు కేశవరావు, జంగు పత్రిక ఏడిటర్ నాగేశ్వరరావు మరి కొందరిని ఎన్ కౌంటర్ చేయడం దుర్మార్గమన్నారు. బూటకపు హత్యలు చేసి ఆదివాసీ అమాయక ప్రజలను, మావోయిస్టు నాయకులను ఆపరేషన్ కగార్ పేరుతో హతమారుస్తున్నారని విమర్శించారు. ఆపరేషన్ కగార్ ను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వం అడవులలో ఉన్న వనరులను కార్పొరేట్ బడా బాబులకు కట్టబెట్టడం కోసం ఆదివాసులను హతమారుస్తున్నారని, మహిళలపై అత్యాచారాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా 2026 నాటికి నక్సల్స్ రహిత భారత దేశాన్ని నిర్మిస్తామని ప్రకటించడం సిగ్గుచేటన్నారు. మావోయిస్టు నేతలు ప్రతిపాదిస్తున్న ప్రజల సమస్యలను పరిష్కరించడంపై కంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాలన్నారు. తక్షణమే కాల్పులకు స్వస్థిపలికి శాంతియుత చర్చలే పరిష్కారమని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గ్రహించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వై. వెంకటేశ్వరరావు నల్లపాటి రామారావు, పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు శిఖినం చిన్నా, వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ క్లస్టర్ డెవలప్మెంట్ కార్యక్రమంలో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ ఏ.భార్గవ్‌తేజ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో భార్గవ్‌తేజ అధ్యక్షతన జిల్లా ఇండస్ట్రియల్ అండ్ ఎక్స్పోర్ట్ ప్రమోషన్ కమిటీ (డీఐఈపీసీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎమ్ఎస్ఎంఈ క్లస్టర్లు ఏర్పాటుకు అనుకూలమైన భూములను పరిశ్రమలశాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు సమన్వయం చేసుకుంటూ వెంటనే గుర్తించాలన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో గోల్డ్‌స్మిత్, హ్యాండ్లూమ్ క్లస్టర్ ఏర్పాటును వేగవంతం చేయాలన్నారు. గోల్డ్‌స్మిత్ క్లస్టర్‌కు సంబంధించి డిపిఆర్ పూర్తి చేసి అనుమతి కోసం కేంద్ర ప్రభుత్వానికి పంపించడం జరిగిందన్నారు. ఇందుకు సంబంధించి అనుమతి రావాల్సి వుందని జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ జయలక్ష్మి కలెక్టర్‌కు తెలిపారు. పిఎంఈజిపీ పథకం క్రింద 41 ఎంఎస్ఎంఈలు లక్ష్యం కాగా, 170 మంజూరు చేయడం జరిగిందని, ఇందులో 101 ఎంఎస్ఎంఈలకు రూ. 6 కోట్ల, 72 లక్షల 68 లక్షల మంజూరు చేసిన రుణాలు వెంటనే అందించి, యూనిట్లు గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ సబ్సిడీ కోసం నిర్దేశిత ధ్రువపత్రాలను దరఖాస్తు సమయంలో అందించని ఎంఎస్ఎంఈలకు అవసరమైన ధ్రువపత్రాలు వెంటనే



మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ భార్గవ్‌తేజ

అందించాలన్నారు. అప్పటికీ స్పందించకపోతే సంబంధిత దరఖాస్తులను తిరస్కరించాలన్నారు. జిల్లాలో 27 ఎంఎస్ఎంఈ పరిశ్రమలకు ఇన్వెస్ట్ మెంట్ సబ్సిడీ, రియంబర్స్‌మెంట్ ఆఫ్ ఇంట్రస్ట్ సబ్సిడీ, రీయింబర్స్మెంట్ ఆఫ్ పవర్‌కాస్ట్ సబ్సిడీ , రీయింబర్స్మెంట్ ఆఫ్ సేల్స్ టాక్స్ సబ్సిడీ, రీయింబర్స్మెంట్ ఆఫ్ స్టాంప్ డ్యూటి సబ్సిడీకి సంబంధించి రూ.2 కోట్ల, 62 లక్షల 33,590లు మంజూరు చేస్తూ సమావేశంలో ఇన్ చార్జ్ జిల్లా కలెక్టర్ ఏ. భార్గవ్ తేజ ఆమోదించారు. కామన్ ఫెసిలిటీ సెంటర్ (సి ఎఫ్ సి) క్రింద మేడికొండూరు, చేబ్రోలు, తెనాలి, మంగళగిరి, ప్రత్తిపాడు మండలాల్లో 361.4 ఎకరాలు ఏపి ఐ ఏ సి భూములు లభ్యం కానందున పెండింగ్ లో వుంచాలని ఇన్ చార్జ్ జిల్లా కలెక్టర్ ఏ. భార్గవ్ తేజ సూచించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ జయలక్ష్మి, లీడ్ బ్యాంకు మేనేజరు మహిపాల్‌రెడ్డి, జిల్లా భూగర్భ జల వనరుల శాఖ డిప్యూటీ డైరక్టర్ వందనం వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నాణ్యమైన సన్నబియ్యం పంపిణీతోనే అవినీతికి అడ్డుకట్ట

ప్రజాశక్తి-గుంటూరు

రేషన్ బియ్యంలో అవినీతిని నివారించడానికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తెలంగాణ మాదిరిగా నాణ్యమైన సన్నబియ్యాన్ని రేషన్‌కార్డు దారులకు అందించాలని వివిధ పార్టీల నాయకులు, సంఘాల నాయకులు అన్నారు. 'రేషన్ బియ్యంలో అవినీతి – పరిష్కారాలు' అనే అంశంపై స్థానిక రామన్నపేటలోని జనచైతన్య వేదిక హాల్లో జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వి.లక్ష్మణరెడ్డి అధ్యక్షతన చర్చాగోష్టి నిర్వహించారు. బియ్యంతో పాటు రాగులు, జొన్నలు, కొర్రలు, సాములు లాంటి వాటిని అందించాలని, కేరళ మాదిరిగా ప్రజలకు మూడు రకాల కార్డులు అందుబాటులో ఉంచాలని ఒక కార్డు రేషన్ బియ్యం కోసం, మరొక కార్డు సంక్షేమ పథకాల కోసం, మూడవ కార్డు ఇతర అవసరాల కోసం వినియోగించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధాన వక్తగా పాల్గొన్న సిపిఐ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ కేరళలో 16 రకాల సరుకులు ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా అందిస్తున్నారని, తమిళనాడులో 7, 8 రకాల వస్తువులు అందిస్తున్నారని తెలిపారు. జీవన శైలిలో వచ్చిన మార్పులకు అనుగుణంగా చిరు ధాన్యాలను ప్రోత్సహించాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ రేషన్


మాట్లాడుతున్న జల్లి విల్సన్

బియ్యంలో అవినీతి, నగదు బదిలీ పథకం ద్వారా పరిష్కారం కాదని నాణ్యమైన నిత్యవసరాలు అందించడమే సరైన మార్గం అన్నారు. రేషన్ షాపులతోపాటు బియ్యం పంపిణీ వాహనాలు కూడా కొనసాగించడం ద్వారా వద్ధులకు, వికలాంగులకు తోడ్పడుతుందన్నారు. లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 1.6 కోట్ల కుటుంబాలు ఉండగా వారిలో 1.48 కోట్ల రేషన్ కార్డులు ఉన్నాయని తెలిపారు. ఆహార భద్రత కోసం ఏర్పాటు చేసిన ప్రజా పంపిణీ వ్యవస్థ అధికార పార్టీ ఎమ్మెల్యేలకు కాసులు కురిపించే వ్యవస్థగా మారిందన్నారు. దాదాపు 80శాతం మంది లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న లావు బియ్యాన్ని తినడం లేదని, కేజీ రూ.10ల నుండి రూ.15లకు దళారులకు విక్రయిస్తున్నారన్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు మండలానికి ఒక ఏజెంట్‌ను నియమించుకుని వారి ద్వారా ప్రతినెలా రూ.20 లక్షలు తీసుకుంటున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి బిళ్ళా సునీల్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 29వేల రేషన్ షాప్స్ ఉన్నాయని, వాటిని మరింత పటిష్ట పరిచి మినీ సూపర్ బజార్లగా మార్చాలన్నారు.రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కాటా ఆంజనేయులు మాట్లాడుతూ నాణ్యతలేని, తినడానికి వీలుకాని బియ్యాన్ని రాష్ట్రప్రభుత్వం అందించడం ద్వారానే అవినీతికి, దళారి వ్యవస్థకు దారి తీస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ డిఎఆర్ సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు కె. జగదీష్, మానవత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు చావా శివాజీ, నల్లబోతు సాంబశివ రావు, ఆలా అనంత రామయ్య, జనవిజ్ఞాన వేదిక నేత గోరంట్ల వెంకటరావు ప్రసంగించారు.

అవుట్‌ఫాల్ డ్రెయిన్లలో పూడికతీతను వేగవంతం చేయాలి : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరపాలకసంస్థ పరిధిలో అవుట్‌ఫాల్ డ్రైన్లలో పూడికతీత పనులు వేగవంతం చేయాలని, మైనర్ డ్రైన్లు అవుట్‌ఫాల్ డ్రైన్లలో కలిసే ప్రాంతాల్లో ప్లాస్టిక్, ఇతర వ్యర్ధాలు రాకుండా మెష్‌లను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ శాంతినగర్, రత్నపురికాలనీ, ముత్యాల రెడ్డినగర్ ప్రాంతాలలో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. శాంతి నగర్‌లో అవుట్‌ఫాల్ డ్రైన్ పొంగి మురుగు ఇళ్లల్లోకి వస్తుందని స్థానికుల ఫిర్యాదు మేరకు పరిశీలించి, వెంటనే పూడిక తీత పనులు చేపట్టాలని, అంతర్గత డ్రైన్‌ల నుండి వ్యర్ధాలు నేరుగా అవుట్ ఫాల్ డ్రైన్‌లో కలవకుండా మెష్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రజారోగ్య విభాగ కార్మికులు తమకు కేటాయించిన ఇళ్ల నుండి నూరు శాతం చెత్త సేకరణ చేయడం ద్వారా ప్రజలు రోడ్ల మీద, కాల్వల్లో వ్యర్ధాలు వేయడం తగ్గుతుందన్నారు. పర్యటనలో ఏసీపీ రెహ్మాన్, డిఈఈ రమేష్‌బాబు, సర్వేయర్ లక్ష్మీనారాయణ, ఇంజినీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

విజ్ఞాన్స్ విద్యార్థులకు రాష్ట్రస్థాయి అవార్డులు

ప్రజాశక్తి-గుంటూరు : చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ విద్యార్థులు డి.నరేంద్రనాథ్, చల్లా సంజనలకు రాష్ట్రస్థాయి అవార్డులు లభించాయని వర్సిటీ వీసీ కల్నల్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ తెలిపారు. అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర పర్యావరణ కాలుష్య నియంత్రణ కేంద్రం (సీఈపీసీ), యూనివర్సిటీలోని రసాయన శాస్త్రవిభాగం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బయోడైవర్సిటీ బోర్డుతో కలిసి విద్యార్థుల కోసం మూడు విభాగాలలో వ్యాసరచన, చిత్రలేఖనం, ఫోటోగ్రఫీ పోటీలు నిర్వహించారని, ఈ పోటీలలో తమ యూనివర్సిటీకు చెందిన మొదటి సంవత్సరం బీటెక్ విద్యార్థులు చల్లా సంజనా (పెయింటింగ్), డీ.నరేంద్రనాథ్ (ఫోటోగ్రఫీ) విభాగాలలో రాష్ట్ర స్థాయి కేటగిరీలో పోటీపడి మొదటి విజేతలుగా నిలిచారన్నారు. వీరికి విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్ చేతులుమీదుగా మెమెంటోలు, ప్రామాణిక పత్రాలు అందజేసారని వెల్లడించారు. ఆయా విద్యార్థులను వీసీ, డీన్‌లు, అధ్యాపకులు అభినందించారు.


విద్యార్థులను అభినందిస్తున్న వీసీ